మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి..

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 12-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 13 Issue: 13

12 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి త్రయోదశి రా. 10:28 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం రోహిణి ఉ. 8:27 వరకు తరువాత ఆరుద్ర యోగం వృద్ధి రా. 8:01 వరకు కరణం గరజి మ. 12:17 వరకు వనిజ రా. 10:28 వరకు వర్జ్యం మ. 1:26 నుండి మ. 2:51 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:13 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:59 వరకు గుళికాకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు తె. 5:36 నుండి ఉ. 7:02 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# సిరిసిల్ల స్వరం మూగబోయింది!

## భారతీయ సంగీత సరస్వతి జానకమ్మ కన్నుమూత

## గుండెపోటుతో మైసూర్ ఆస్పత్రిలో చివరి శ్వాస

ప్రముఖ సినీనేపథ్య గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానకి గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. వయసు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె శనివారం ఈ లోకాన్ని విడిచి వెళ్లారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో కలిపి 50వేలకు పైగా పాటలతో గాన కోకిలగా విరాజిల్లిన జానకి ఇక లేరనే వార్త సంగీత ప్రియులను కలచివేస్తోంది. లెజెండరీ గాయని ఎస్.జానకి గుండెపోటుతో మరణించారు.

(దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

మైసూర్‌లోని అపోలో బీజీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె 88 ఏళ్ల వయసులో ప్రాణాలు విడిచారు. తన మధురమైన గాత్రంతో సంగీత ప్రియుల ఆదరాభిమానాలు చూరగొన్న జానకి ఇకలేరనే విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. దక్షిణాదిలో నేపథ్య గాయనిగా పాపులరైన ఎస్.జానకి 1938 ఏప్రిల్ 23న జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా రేపల్లె -2 వ పేజీలో...

# రిటైర్డ్ ఇంజినీర్లను జైలుకు పంపాలె

## వాతావరణ శాస్త్రవేత్తలకు బెల్ట్ ట్రీట్మెంట్ ఇవ్వాలె

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను కోసం రక్తంతో పంటల మీద చల్లాలె

## కేసీఆర్ కిలాడీ కమిటీలో ఈటల కూడా చేరిండు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజం



కేసీఆర్‌తో తప్పుడు పనులు చేయించిన రిటైర్డ్ ఇంజనీర్లను ఇప్పటివరకు జైల్లో పెట్టకపోవడమే తాము చేసిన పెద్ద తప్పని, అందుకే శ్యామ్ ప్రసాద్ రెడ్డి లాంటి వారు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు , గోదావరి నీళ్ల తరలింపు అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నీళ్లు ఎత్తిపోయడం లేదంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రతిపక్షాలు కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

హైదరాబాద్, జూలై 11 (ఈవార్తలు): బీఆర్ఎస్ నేతలు మాట్లాడే మాటలను పెద్దగా సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదని కొట్టిపారేసిన సీఎం, కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ తన వాదనను ప్రజలపై రుద్దాలని చూస్తోందని ఆరోపించారు. ఇదే క్రమంలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా బీఆర్ఎస్ అజెండాను ఎత్తుకోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈటల పట్ల తనకు గౌరవమే ఉందని, కానీ హరీశ్ రావు అడిగితే ఆయన బీఆర్ఎస్ కు అనుకూలంగా మాట్లాడి తన గౌరవాన్ని పోగొట్టుకున్నారని, ప్రభుత్వానికి మంచి సూచనలు చేసి ఉంటే బాగుండేదని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన చారిత్రక తరువాయి 2 వ పేజీలో...




## 10.14 సెకన్లలో 100 మీటర్లు

### తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు

భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా -2 వ పేజీలో...



## వింబుల్డన్ విజేత లిండా నోస్కోవా

ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను చెక్ రిపబ్లిక్‌కు చెందిన యువ టెన్నిస్ స్టార్ లిండా నోస్కోవా కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఆల్-చెక్ ఫైనల్లో కరోలినా ముచోవాపై 6-2, 5-7, 6-3 తేడాతో విజయం సాధించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని అందుకుంది.

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,482 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,997 |

# అర్ధగంటలో ఆరుగురిని చంపేశాడు!

## పోక్సో కేసు కక్షతో దారుణ హత్యలు.. రంగారెడ్డి షాబాద్‌లో కిరాతకం

సాక్షి, షాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడ గ్రామంలో శనివారం తెల్లవారుజామున రాష్ట్రాన్ని ఉలిక్కిపడేలా చేసిన సామూహిక హత్యలు చోటుచేసుకున్నాయి. తనపై పోక్సో కేసు నమోదు చేశారనే కక్షతో ఓ వ్యక్తి మొత్తం ఆరుగురిని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. మృతుల్లో తనపై ఫిర్యాదు చేసిన బాలిక, ఆమె తల్లి, నానమ్మతో పాటు తన భార్య, మూడేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉండటం గమనార్హం.



రంగారెడ్డి, జూలై 11 (ఈవార్తలు): పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌పై ఓ బాలికను(17) వేధించాడంటూ ఈ ఏడాది మే 16న బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మే 26న అరెస్టు చేశారు. అనంతరం శుక్రవారం అతడు బెయిల్‌పై విడుదలై గ్రామానికి తిరిగి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున.. సరాసరి తన ఇంటికి వెళ్లి భార్య సరిత (30), మూడేళ్ల కుమార్తె పరీక్షిత్, రెండేళ్ల కుమారుడు రుద్రవాన్స్‌లను కత్తితో పొడిచి హతమార్చాడు. అనంతరం నేరుగా బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి.. బాధితురాలి తల్లి చిట్యాల లక్ష్మి, నానమ్మ చిట్యాల రుక్కమ్మ (65)లను అదే కత్తితో తరువాయి 2 వ పేజీలో...




## 15 మంది భారతీయులు జల సమాధి

### వియత్నాం పడవ ప్రమాదంలో మృతి

న్యూఢిల్లీ: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన 'ఫు క్వాక్' ద్వీపం సమీపంలో పర్యాటకులతో వెళ్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడటంతో ఈ దారుణం జరిగింది. మొత్తం 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు సిబ్బందితో కూడిన ఈ పర్యాటక బోట్.. థాయిలాండ్ గల్ఫ్ పరిధిలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



దేశ బాధ్యతలను మోయడానికి కూడా సిద్ధమవుతోంది స్పెయిన్ యువరాణి లియోనోర్. 20 ఏళ్ల వయస్సులోనే ఆమె ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో సైనిక శిక్షణ పూర్తి చేసి, భవిష్యత్‌లో స్పెయిన్ రాణిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. 2005లో జన్మించిన లియోనోర్.. స్పెయిన్ రాజు ఫెలిపే-6, రాణి లెటిజియా దంపతుల పెద్ద కుమార్తె. వేల్స్‌లోని యునైటెడ్ వరల్డ్ కాలేజీలో విద్యను అభ్యసించిన అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చి రాజ కుటుంబ బాధ్యతలతో పాటు సైనిక శిక్షణను కొనసాగించారు. లియోనోర్ సింహాసనం అధిష్ఠించిన తర్వాత, 19వ శతాబ్దంలో పాలించిన రాణి ఇసబెల్లా-2 అనంతరం స్పెయిన్‌ను పాలించే తొలి రాణిగా చరిత్ర సృష్టించనున్నారు. దాదాపు 150 ఏళ్ల తర్వాత స్పెయిన్‌కు మరో మహిళా పాలకురాలు రావడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

# కేసీఆర్ సైనికుడు హరీశ్

## శీలపరీక్ష రేవంత్‌కే చేయాలి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'హరీశ్ రావు కేసీఆర్ తయారు చేసిన ఒక సైనికుడు. కేసీఆర్‌కు ఈరోజు కాదు పార్టీ ఆవిర్భావం ముందు నుంచి ఒక రక్షణ కవచంలా అండగా నిలబడ్డ నాయకుడు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. హరీశ్ రావు మీద ఎప్పటి నుంచో ఈ పుకార్లు వస్తనే ఉన్నయి.



హైదరాబాద్, జూలై 11 (ఈవార్తలు): ఆయన చెప్తనే ఉన్నడు పాపం. ఆయన ఒక్కసారి కాదు.. ఇప్పటికి కొన్ని వందల సార్లు చెప్పిండు. నాకు క్యారెక్టర్ ఇంపార్టెంట్.. నేను నీలాగా కాదు రేవంత్ రెడ్డి. నువ్వు నాలుగు పార్టీలు మారి నోడివి.. నువ్వు మాట్లాడితే ఎట్లా..? అని కూడా చెప్పిండు. ఆయనను ఇంకా ఎన్నిసార్లు హరీశ్ రావుతో చెప్పిస్తరన్నారు. ఈ దేశంలో, రాష్ట్రంలో శీలపరీక్షలు ఎవరికన్నా పెట్టాల్సింది ఉంటే అది రేవంత్‌రెడ్డికి.. ఎందుకంటే -2 వ పేజీలో...



# వందేమాతరమే ఫస్ట్

## జాతీయ గీతాలే ముందు పాడాలి.. కేంద్ర హోంశాఖ కొత్త గైడ్‌లైన్స్

న్యూఢిల్లీ: జాతీయ గీతం జనగణమన, జాతీయ గేయం వందేమాతరం ఆలపించే విధానంపై కేంద్ర హోంశాఖ తాజాగా అత్యంత కీలకమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో అధికారికంగా ప్రత్యేక రాష్ట్ర గీతాలు ఉన్నప్పటికీ.. జాతీయ ప్రాధాన్యత కలిగిన వందేమాతరం, తరువాయి 2 వ పేజీలో...



## తిరుమలలో దర్శనం క్యూలైన్లు మూసివేత

### కొండపై అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీ

తిరుమల, జూలై 11 (ఈవార్తలు): తిరుమలలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. వీకెండ్ కావటంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శనం కోసం బారులు తీరారు. దీంతో అప్రమత్తమైన తిరుమల తిరుపతి దేవస్థానం ముందస్తు చర్యలు చేపట్టింది. శ్రీవారి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు. మరోవైపు సాధారణ రోజులలో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

12.7.2026

మేషం: ఈరోజు ఆర్థిక విషయాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. ఉద్యోగంలో మీ కృషికి ప్రశంసలు అందుకుంటారు. కొత్త పనులు ప్రారంభించడానికి అనుకూలమైన సమయం. ఆరోగ్యంపై స్వల్ప శ్రద్ధ అవసరం. దైవారాధన మనశ్శాంతిని కలిగిస్తుంది.

వృషభం: ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రారంభించిన పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా అనుకూల ఫలితాలు ఉంటాయి. కుటుంబంలో ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది. తొందరపాటు నిర్ణయాలను మాత్రం నివారించండి.

మిథునం: అనవసర ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యమైన విషయాల్లో ఓర్పుతో వ్యవహరించడం మంచిది. ఉద్యోగంలో బాధ్యతలు అధికమవుతాయి. ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. పెద్దల సలహా మీకు మేలు చేస్తుంది.

కర్కాటకం: మిత్రుల సహాయంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. ఆదాయంలో పెరుగుదల కనిపిస్తుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. బంధువుల నుండి శుభవార్త వినే అవకాశం ఉంది. పెట్టుబడుల్లో జాగ్రత్త అవసరం.

సింహం: ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మంచి పురోగతి ఉంటుంది. అధికారుల ఆదరణ లభిస్తుంది. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తారు. ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. అహంకారాన్ని దూరంగా ఉంచడం మంచిది.

కన్య: దూర ప్రయాణాలకు అనుకూల సమయం. శుభకార్యాలపై ఆసక్తి పెరుగుతుంది. గురువుల ఆశీస్సులు లభిస్తాయి. విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దైవదర్శనం శుభప్రదంగా ఉంటుంది.

తుల: కొన్ని పనుల్లో ఆలస్యం జరిగినా చివరకు అనుకూల ఫలితం పొందుతారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. అప్పులు లేదా ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండండి. కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. ఆవేశపూరిత నిర్ణయాలను నివారించండి. శివారాధన శ్రేయస్కరం.

వృశ్చికం: భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన పెరుగుతుంది. భాగస్వామ్య వ్యాపారాలకు అనుకూల సమయం. కొత్త ఒప్పందాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగంలో అభివృద్ధి అవకాశాలు కనిపిస్తాయి. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. శుభవార్తలు అందుతాయి.

ధనస్సు: శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉద్యోగంలో మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యంపై చిన్నచిన్న సమస్యలు రావచ్చు. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఖర్చులను నియంత్రించడం మంచిది.

మకరం: సంతాన సంబంధిత శుభవార్తలు వినే అవకాశం ఉంది. విద్య, కళారంగాల్లో ఉన్నవారికి మంచి ఫలితాలు వస్తాయి. కొత్త ఆలోచనలు విజయవంతమవుతాయి. ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. కుటుంబంలో సంతోషం నెలకొంటుంది. ఇష్టదైవ ప్రార్థన మేలు చేస్తుంది.

కుంభం: ఇంటి విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. ఉద్యోగంలో ఒత్తిడి తగ్గుతుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. ఓర్పుతో వ్యవహరిస్తే అన్ని పనులు సజావుగా పూర్తవుతాయి.

మీనం: ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పనులు పూర్తి చేస్తారు. సోదరులతో అనుబంధం బలపడుతుంది. చిన్న ప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపారంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఆర్థికంగా సంతృప్తికరమైన పరిస్థితులు ఉంటాయి.

# రిటైర్డ్ ఇంజినీర్లను జైలుకు పంపాలె

**మొదటి పేజీ తరువాయి**

వాస్తవాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు. 2019 జూన్ 21న అప్పటి సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రారంభించగా, ప్రాజెక్టు ప్రారంభించిన కేవలం 11 నెలల్లోనే (18 మే 2020న) మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు ఉన్నాయని ఇన్ఫ్రాస్ట్రక్చర్ అధికారులు, ఇంజనీర్ రమణారెడ్డి గుర్తించారని తెలిపారు. కేసీఆరే స్వయంగా సాగునీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడే ఈ లోపాలు బయటపడినా, వారి ఘోర నిర్లక్ష్యం మూలంగానే మేడిగడ్డ కుప్పకూలిందని స్పష్టం చేశారు. అలాగే 2022 జూలై 14న వచ్చిన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిన్నా దాన్ని సరిదిద్దలేదని, అందుకే అది ఇప్పటికీ వినియోగంలోకి రాలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైందని, కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే 2023 అక్టోబర్‌లో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ ఏర్పాటై లోపాలను ఎత్తిచూపుతూ నివేదిక ఇచ్చిందని గుర్తుచేశారు. 2021 డిసెంబర్ 30న ఆమోదం పొందిన డ్యామ్ సేఫ్టీ అథారిటీ చట్టాన్ని అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ విధి కాబట్టే ఎన్‌డీఎస్‌ఏ కమిటీ విజిట్ చేసి, 2026 ఏప్రిల్ 24న ఫైనల్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు.

బ్యారేజీలలో నీటి నిల్వపై ఎన్‌డీఎస్‌ఏ నిబంధనలు

ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ప్రకారం అన్నారం, సుందిల్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రస్తుత స్థితిలో నీటి నిల్వకు పనికిరావని కేంద్ర సంస్థ స్పష్టంగా చెప్పిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. మూడు బ్యారేజీల్లో గేట్లు మూసి నీళ్లు నింపడం కుదరదని, ఎన్‌డీఎస్‌ఏ , సీడబ్ల్యూసీ అనుమతులు లేకుండా ఎలాంటి పనులు లేదా రిపేర్లు చేయవద్దని ఆంక్షలు ఉన్నాయని వివరించారు. "మేడిగడ్డలో 5 టీఎంసీల నీళ్లు నిల్వ చేసే అవకాశం ఉంటేనే నీటిని ఎత్తిపోయగలం. గేట్లు దించకుండా నీటిని ఎలా నిల్వ చేస్తాం? ఒకవేళ గేట్లు దించితే నీళ్లు వెనక్కి కన్నెపల్లికి పోతాయి. అన్నారంలో 107 మీటర్లు, సుందిల్లలో 126 మీటర్ల ఎత్తులో నీటి నిల్వ ఉంటేనే పంపులు పనిచేస్తాయి" అని సాంకేతిక కారణాలను వివరించారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం ఉన్న ప్రాజెక్టు కొట్టుకుపోయేలా కుట్రలు చేస్తూ, ప్రజల ముందు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దోషులుగా నిలబెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు ఎల్లంపల్లి నుండే నీళ్లు వస్తున్నాయని, కాళేశ్వరానికి మేడిగడ్డ వెన్నుపూస అయితే, ఎల్లంపల్లి గుండెకాయ లాంటిదని పేర్కొన్నారు.

కేంద్రం లేఖ.. 'కిలాడి కమిటీ'పై విమర్శలు

ప్రాజెక్టు పునరుద్ధరణకు తాము శాయశక్తులా కృషి చేస్తున్నామని, ఈ క్రమంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం 2026 జూన్ 30న కేంద్ర ప్రభుత్వం ఒక లేఖ రాస్తూ మూడు బ్యారేజీల కోసం కమిటీని ఏర్పాటు చేసిందని సీఎం వెల్లడించారు. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ముగ్గురు ప్రతినిధులను తీసుకోవాలని కేంద్రం సూచించిందని, సాంకేతిక నిపుణుల సాయంతో పునరుద్ధరణ పనులు చేపట్టాలని స్పష్టం చేసిందని తెలిపారు. "మా ముందు ఇప్పుడు రెండు కమిటీలు ఉన్నాయి.. ఒకటి ఎన్‌డీఎస్‌ఏ వేసిన నిపుణుల కమిటీ, రెండోది కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, ఈటల సభ్యులుగా ఉన్న 'కిలాడి కమిటీ'" అని ఎద్దేవా చేశారు.

హరీశ్.. నీదీ ఓ బతుకేనా?

మాజీ మంత్రి హరీశ్ రావు టార్గెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. హరీశ్ రావును ఆనాడు వాళ్ల మామ కేసీఆరే నమ్మలేదని సెటైర్లు వేశారు. కమీషన్లు బొక్కిన సంగతి తెలిసిపోవడం వల్లే... హరీశ్ రావును కేసీఆర్ పక్కనబెట్టారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కమీషన్ల కక్కుర్తితో ఇప్పుడు క్రషర్లను కూడా వదలకుండా హరీశ్ రావు బతుకుతున్నారని మండిపడ్డారు. ఆనాడు ఆంధ్రా సంస్థలంటూ విమర్శించిన నారాయణ, చైతన్య విద్యాసంస్థలకు ఇవాళ పాలు పోసి బతుకుతున్న నీదీ ఒక బతుకేనా అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో పట్టిసీమకు ఏకంగా 105 టీఎంసీల నీటిని తరలిస్తుంటే... అప్పుడు హరీశ్ రావు గాడిదలు కాశారా అంటూ సీఎం నిలదీశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు వినియోగంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టుకు నీళ్లు పోవని హరీశ్ రావు చెప్పగలరా అని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సంస్థ అయిన ఎన్డీఎస్ఏ కమిటీ సూచనలు పాటిస్తుంటే.. కేసీఆర్ మాత్రం తన వైపు నుంచి ఒక కిలాడీల కమిటీ ఏర్పాటు చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ కిలాడీల కమిటీలో కేసీఆర్ చైర్మన్ అయితే... హరీశ్ రావు, కేటీఆర్ సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ కిలాడీల కమిటీలోకి బీజేపీ నేత ఈటల రాజేందర్ కూడా చేరారని సీఎం ఆరోపించారు. వీరిని చర్లపల్లి జైలుకు పంపితేనే... వాళ్లు చేసిన అప్పులేంటో, తప్పులేంటో జనానికి తెలుస్తుందన్నారు. ఆ గజదొంగల గుంపులో చేరొద్దని ఈటల రాజేందర్ కు సూచించారు. చేతనైతే ఈ కిలాడీ కమిటీని ఢిల్లీలోని ఎన్డీఎస్ఏ కమిటీ వద్దకు తీసుకెళ్లి, బ్యారేజీలపై మీ వాదనలను ఒప్పించాలని... వారు ఓకే చెప్తే తాము కూడా ముందుకు వెళ్తామని, అంతేకానీ తప్పుడు ప్రచారాలు చేయొద్దని సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# సిరిసిల్ల స్వరం మూగబోయింది!

**మొదటి పేజీ తరువాయి**

మండలంలోని పల్లపట్ల ఆమె స్వస్థలం. నేపథ్య గాయనిగా తమిళంలో మొదటి పాటపాడారు. అనంతరం 1957లో విడుదలైన ఎమ్మెల్యే చిత్రంలో నీ ఆశ ఆడియాస పాటతో ఆమె తెలుగు అభిమానులకు పరిచయమయ్యారు. తొలితరం గాయకుడు ఘంటసాల నుంచి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతోనూ ఎన్నో అద్భుతమైన గీతాలు ఆలపించారు జానకి. ఉత్తమ గాయనిగా 4 సార్లు జాతీయ పురస్కారం అందుకున్నారామె. పది నంది అవార్డులు.. కేరళ ప్రభుత్వం నుంచి 11 అవార్డులు.. ఒడిశా నుంచి ఒకటి.. 1986లో కలైమామణి అవార్డు స్వీకరించారు. ఆమె మరణంతో భారతీయ సినీ సంగీత చరిత్రలో ఒక స్వర్ణయుగం ముగిసిందని సంగీత విద్వాంసులు, సినీ ప్రముఖులు, అభిమానులు భావోద్వేగంతో నివాళులర్పిస్తున్నారు.

సిరిసిల్లలో తొలి గాత్రం

'తొమ్మిదేళ్ల వయసులో సిరిసిల్ల వేదికపై తొలి పాటతో గానయాత్రకు జానమ్మ శ్రీకారం చుట్టారు. ఎస్. జానకి పూర్తి పేరు శిష్టల శ్రీరామమూర్తి జానకి. ఆమె 1938 ఏప్రిల్ 23న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పల్లపట్ల గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే సంగీతంపై అపారమైన ఆసక్తి పెంచుకున్న ఆమె, శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సంగీతాన్ని జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారు. 1957లో సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె, అనంతరం దక్షిణ భారత చిత్రసీమలో తిరుగులేని నేపథ్య గాయనిగా ఎదిగారు. ఆమె తన కెరీర్‌లో సుమారు 48,000కు పైగా పాటలు పాడారు. మొత్తంగా 15కి పైగా భారతీయ భాషల్లో ఆమె స్వరమాధుర్యం వినిపించింది. ప్రేమ, విరహం, భక్తి, జానపదం, లాలిపాట, విషాదం, ఉత్సాహం.. ఏ భావమైనా తన స్వరంతో శ్రోత హృదయంలో నిలిచిపోయేలా చేయగల అరుదైన ప్రతిభ ఎస్. జానకిదే. సంగీత దర్శకులు ఆమెను ఒకే పాటలో అనేక భావాలను పలికించగల గాయనిగా కొనియాడేవారు. ఎస్. జానకి జీవితంలో తెలంగాణలోని సిరిసిల్లకు ప్రత్యేక స్థానం ఉంది.ఆమె, తండ్రి శ్రీరామమూర్తి ఆయుర్వేద వైద్యుడు, ఉపాధ్యాయుడిగా (టీచర్‌గా) పనిచేయడంతో కుటుంబం అప్పటి కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో నివసించింది. దీంతో జానకి తన బాల్యంలో ఎక్కువ భాగాన్ని సిరిసిల్లలోనే గడిపారు. సంగీతంపై ఆమెకు ఉన్న సహజ ప్రతిభకు తొలి గుర్తింపు కూడా సిరిసిల్లలోనే లభించింది. కేవలం తొమ్మిదేళ్ల వయసులో సిరిసిల్లలో జరిగిన ఒక వేదికపై ఆమె తొలిసారిగా ప్రజల ముందర పాట పాడారు. ఆ చిన్న వేదికపైనే మొదలైన గానయానం తర్వాత భారతీయ సినీ సంగీత చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖితమైంది. అందుకే సిరిసిల్ల ప్రజలు ఎస్ జానకిని తమ నేలతో ముడిపడిన గానకోకిలగా గర్వంగా చెప్పుకుంటారు.

ఇళయరాజా, ఎస్పీబీలతో అద్భుత ప్రయాణం

ఎస్. జానకి కెరీర్‌లో సంగీత దర్శకుడు ఇళయరాజాతో చేసిన ప్రయోగాలు ఒక చరిత్ర. అలాగే గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె పాడిన వేలాది యుగళగీతాలు భారతీయ సినీ సంగీతంలో మైలురాళ్లుగా నిలిచిపోయాయి. ఎం.ఎస్. విశ్వనాథన్ నుండి ఏ.ఆర్. రెహమాన్ వరకు ప్రతి ఒక్కరి దర్శకత్వంలో ఆమె క్లాసిక్స్ అందించారు.

4 జాతీయ అవార్డులు

దిగ్గజ గాయని ఎస్. జానకి తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అందుకున్నారు. ఆమె అద్భుత గాత్రానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నాలుగు సార్లు 'ఉత్తమ నేపథ్య గాయని'గా జాతీయ చలనచిత్ర పురస్కారాలు లభించాయి. 1977లో భారతీరాజా దర్శకత్వం వహించిన '16 వయదినిలేస (16 ఏళ్ల వయసు) చిత్రంలో ఇళయరాజా సంగీతంలో పాడిన "సెంధూర పూవే" అనే తమిళ పాట జానకమ్మ కెరీర్‌లో మొదటి జాతీయ అవార్డును అందించింది. ఆ తర్వాత 1981లో 'ఒప్పోల్' సినిమాలోని "ఎట్టుమానూర్ అంబలత్తిల్" అనే మలయాళ క్లాసికల్ మెలోడీకి రఘునాథ్ సేఠ్ సంగీతం అందించగా, జానకి తన గాత్రంతో ఈ పాటకు ప్రాణం పోసి రెండోసారి జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు.

కర్ణాటక ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ఎస్ జానకి అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని కర్ణాటక ముఖ్యమంత్రి డికే శివకుమార్ అధికారులను ఆదేశించారు. కన్నడ ప్రభుత్వం తరపున జానకమ్మ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా మంత్రి యతీంద్ర సిద్దరామయ్యను నియమించారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు కణియనహుండి ప్రాంతంలోని దిగ్గజ గాయని ఫామ్ హౌస్‌లో అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలుగు, తమిళ చిత్రసీమలకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులు, అభిమానులు హాజరై తుది నివాళి అర్పించనున్నారు.

## 15 మంది భారతీయులు జల సమాధి

**మొదటి పేజీ తరువాయి**

ఈ మ్యాచ్ రెండు గంటలకు పైగా సాగగా, తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన నోస్కోవా, రెండో సెట్‌లో ముచోవా ప్రతిఘటనను ఎదుర్కొన్నప్పటికీ నిర్ణయాత్మక మూడో సెట్‌లో అద్భుత ఆటతీరుతో విజేతగా నిలిచింది. 21 ఏళ్ల నోస్కోవా వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన తాజా చెక్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఇదే ఆమె కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కాగా, తొలి అవకాశాన్నే టైటిల్‌గా మలచుకుంది. ఈ విజయంతో ప్రపంచ టెన్నిస్‌లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్న నోస్కోవా, ఇటీవలి కాలంలో చెక్ మహిళల టెన్నిస్ ఆధిపత్యాన్ని మరోసారి చాటింది. 2026 వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా నిలిచిన నోస్కోవా, గత ఏడాది ఛాంపియన్ ఇగా స్వియాటెక్ తర్వాత ట్రోఫీని అందుకున్న కొత్త రాణిగా అవతరించింది.

## అర్ధగంటలో ఆరుగురిని చంపేశాడు!

**మొదటి పేజీ తరువాయి**

కిరాతకంగా హతమార్చాడు. ఆపై బాధిత బాలికను ఎత్తుకెళ్లి ఊరి శివారులో అత్యాచారం జరిపి మరీ హత్య చేశాడు. హత్యల అనంతరం రాజ్‌కుమార్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి.. తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో షాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దారుణం గ్రామాన్ని భయాందోళనలకు గురిచేసింది. ప్రాథమిక విచారణలో పోక్సో కేసుపై కక్షే ఈ సామూహిక హత్యలకు కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాలికను రాజ్‌కుమార్ ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యల్లో ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న దుర్మార్గుడి కోసం గాలింపు చేపట్టారు. నగర పోలీసు కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీ యోగేష్ గౌతమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. రాష్ట్రంలో ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న అత్యంత దారుణమైన సామూహిక హత్యల ఘటనల్లో ఇదొకటిగా పోలీసులు పేర్కొంటున్నారు. ఈ ఘటనతో దైవాలగూడ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఒకేరోజు ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్తులు షాక్‌కు గురయ్యారు. అదే సమయంలో.. నిందితుడి విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాక్షసుడు రాజ్‌కుమార్ తన కుటుంబాన్నిఎందుకు కడతేర్చాడనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. మృతదేహాల్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 10.14 సెకన్లలో 100 మీటర్లు

**మొదటి పేజీ తరువాయి**

జరిగిన పుమా ఫాస్ట్ ఆర్ఫ్ లెగ్స్ 2026 మీట్‌లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు. ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆర్ఫ్ లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్(10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.

# 15 మంది భారతీయులు జల సమాధి

**మొదటి పేజీ తరువాయి**

విహారయాత్రను ముగించుకుని, తిరిగి 'అన్ థోయ్' పోర్టుకు వస్తుండగా ఒక్కసారిగా తిరగబడింది. ఈ ప్రమాదంలో 15 మంది భారతీయులు మరణించగా, మిగిలిన 21 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ప్రాణాలతో బయటపడిన వారిలో 17 మంది పర్యాటకులు, నలుగురు బోట్ సిబ్బంది ఉన్నారు. బోటులో ఉన్న మొత్తం 36 మంది వివరాలు లభ్యమయ్యాయని, అయితే ప్రాణాలతో బయటపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన 15 మందిలో అత్యధికంగా తమిళనాడుకు చెందిన వారు 10 మంది ఉండగా, ఆంధ్రప్రదేశ్ నుండి ముగ్గురు, కేరళకు చెందిన వారు ఇద్దరు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. హనోయిలోని భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) మరణించిన 15 మంది వివరాలను అధికారికంగా విడుదల చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే వియత్నాం అధికారులు పెద్ద ఎత్తున రెస్క్యూ ఆపరేషన్‌ను ప్రారంభించారు. మెరైన్ రెస్క్యూ సిబ్బందితో కూడిన అత్యవసర బృందాలు గాలింపు చర్యలు చేపట్టి, ప్రాణాలతో బయటపడిన వారికి తక్షణ వైద్య సహాయాన్ని అందించారు. ఈ ఉదంతంపై హనోయిలోని భారత రాయబార కార్యాలయం స్పందిస్తూ.. తాము స్థానిక వియత్నాం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, బాధిత

# వందేమాతరమే ఫస్ట్

**మొదటి పేజీ తరువాయి**

జనగణమనలకే ప్రథమ స్థానం ఇవ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇటీవల తమిళనాడులో నూతన ప్రభుత్వ ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా జాతీయ గేయం, జాతీయ గీతాల ఆలపన అనంతరం.. తమిళ రాష్ట్ర గీతాన్ని చివర్లో పాడటంపై పెద్ద ఎత్తున రాజకీయ వివాదం చెలరేగింది. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపుతూ కేంద్ర హోంశాఖ తాజాగా ఆదేశాలను జారీ చేసింది. కేంద్ర హోంశాఖ విడుదల చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఏ రాష్ట్రంలోనైనా అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం, జాతీయ గేయంతో పాటు ఆయా రాష్ట్ర గీతాన్ని కూడా ఆలపించే ఆనవాయితీ లేదా సంప్రదాయం ఉంటే.. కొన్ని కచ్చితమైన నియమాలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అధికారిక కార్యక్రమం ప్రారంభంలో లేదా ప్రోటోకాల్ ప్రకారం ముందుగా వందేమాతరం, ఆ తర్వాత జనగణమనలను పూర్తిగా ఆలపించాలి. ఈ రెండు పాడడం పూర్తయ్యాక మాత్రమే ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అధికారిక రాష్ట్ర గీతాన్ని పాడాల్సి ఉంటుంది. జాతీయ గౌరవాన్ని కాపాడేందుకే ఈ ప్రాధాన్యత క్రమాన్ని నిర్దేశించినట్లు కేంద్రం పేర్కొంది. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయమైన వందేమాతరాన్ని ఆలపించేటప్పుడు నిడివి, పదాల వినియోగంపై కేంద్రం కఠిన నిబంధనలను విధించింది. అధికారిక రూపంలో ఉన్న వందేమాతరం గేయం మొత్తం ఆరు చరణాలను కలిగి ఉంటుంది. ఈ పూర్తి గేయాన్ని ఆలపించడానికి 3 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ సమయ పరిమితిని, రాగాన్ని కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. వందేమాతరం ఆలపించే సమయంలో ఎలాంటి చిన్న తప్పులు దొర్లకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర హోంశాఖ రాష్ట్రాలను, అధికారులను హెచ్చరించింది. అలాగే జాతీయ గేయానికి సంబంధించి కేంద్రం ఆమోదించిన అధికారిక లిపిని, అందులోని పద వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని చెప్పింది. రాష్ట్ర భాషలు లేదా ఉచ్చారణల సాకుతో జాతీయ గేయ ముద్రను, మూల పదాలను సవరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అలాగే

# తిరుమలలో దర్శనం క్యూలైన్లు మూసివేత

ఉదయం పది గంటలకు టీటీడీ టైమ్ స్లాట్ సర్వదర్శనం టికెట్లు జారీ చేస్తుంది. అయితే భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో శనివారం ఉదయం ఐదింటికే జారీ చేశారు. మరోవైపు శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తులతో అలిపిరి చెకింగ్ పాయింట్ వద్ద నుంచి గరుడ కూడలి దాకా వాహనాలు క్యూ కట్టాయి. దీంతో ట్రాఫిక్ అధికారులు వాహనాలను దారి మళ్లించారు. రుయా ఆస్పత్రి జంక్షన్ వద్ద నుంచి ఇస్కాన్ టెంపుల్ మీదుగా బస్టాండుకు వాహనాలను దారి మళ్లించారు. అలాగే గరుడ కూడలి మీదుగా వెళ్లే వాహనాలను అన్నారావు జంక్షన్ నుంచి బస్టాండ్ వైపు దారి మళ్లించారు. మరోవైపు వారాంతం కావటంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగినట్లు అధికారులు చెప్తున్నారు. ఇక శుక్రవారం రోజున 73,265 మంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. 39,690 మంది తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హుండీ కానుకల ద్వారా టీటీడీకి 4.26 కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. 4.09 లక్షల లడ్డూలను టీటీడీ విక్రయించింది. 2.98 మంది భక్తులు శ్రీవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మరోవైపు 3,899 మంది భక్తులకు వైద్య సహాయం అందించినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

## కేసీఆర్ సైనికుడు హరీశ్

**మొదటి పేజీ తరువాయి**

ఆయన లాగా మాకు లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఆ పరిస్థితి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీకి పోతే ఏం చేస్తడో.. నాకు తెలుసు, మీడియా మిత్రులకు కూడా తెలుసు. మీకు సిగ్గపడుతున్నరు.. చెప్తలేరు. ఆయన పొద్దున కాంగ్రెస్‌తో ఉంటడు.. సాయంత్రం బీజేపీతో ఉంటడు. ఆయన గురించి ఎవరికి తెలియదు.. రాత్రి పోయి బీజేపోళ్ల కాళ్లు పట్టుకుంటడు. పొద్దున్నంతా కాంగ్రెస్‌తో డ్రామా చేస్తడు. ఆయన కూడా హరీశ్ రావు గురించి మా నాయకుల గురించి.. కాబట్టి రేవంత్ రెడ్డి పార్టీ మార్పిడి గురించి ఎంత తక్కువ మాట్లాడితే ఆయన ఆరోగ్యానికి అంత మంచిదని సూచించారు.



# రైతాంగాన్ని ముంచేస్తున్నారు

## కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చు.. మేడిగడ్డ గేట్లు మూయాల్సిన పనిలేదు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 11 (ఈవార్తలు): తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఫోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

\- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# పోక్సో కేసులకు అడ్డాగా తెలంగాణ

## సర్కారుపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్

హైదరాబాద్, జూలై 11 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో పోక్సో కేసు కక్షతో... ఆరుగురిని హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ కేసు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, పటోళ్ల కార్తీక్ రెడ్డి వంటి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల్లో ఈ అరెస్టులు జరిగాయి. ఈ నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం పోక్సో కేసులకు అడ్డాగా మారిందని మండిపడ్డారు. ప్రభుత్వం నిందితుడిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేస్తోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. నిందితుడు ఇంకా పరారీలో ఉండటం దారుణమని అన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, బాధ్యులైన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

# నరరూప రాక్షసుడిపై కఠిన చర్యలు

### రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి



హైదరాబాద్, జూలై 11 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు. మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

# 9వ తరగతి బాలికపై లైంగికదాడి

**ఆలస్యంగా వెలుగులోకి దారుణం!**

**నిందితుడు సమీప బంధువేనని ఆరోపణలు..**

**కరీంనగర్ ఆస్పత్రిలో విషమంగా పరిస్థితి**

**కుటుంబ పరువు పేరుతో కప్పిపుచ్చేందుకు మధ్యవర్తుల యత్నం?**

**సమాచారం అందినా పట్టించుకోని పోలీసులు..**

**కాగజ్‌నగర్‌లో కలకలం**



కాగజ్‌నగర్, జూలై 11 (ఈవార్తలు): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఒక తొమ్మిదో తరగతి బాలికపై లైంగికదాడికి పాల్పడిన అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృగాడి చేతిలో తీవ్ర రక్తస్రావానికి గురైన సదరు బాలిక ప్రస్తుతం కరీంనగర్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనను కొందరు పెద్దలు కప్పిపుచ్చేందుకు యత్నిస్తుండటం, పోలీసుల మధ్య సమాచార లోపం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### స్కూల్లో ఫిట్స్ వచ్చాయని..

ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ నెల 9వ తేదీన బాలిక ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లింది. అయితే స్కూల్లో ఉండగానే సదరు బాలికకు తీవ్రంగా ఫిట్స్ (మూర్ఛ) వచ్చినట్లు ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆందోళనతో పాఠశాలకు చేరుకున్న కుటుంబ సభ్యులు వెంటనే బాలికను కాగజ్‌నగర్ పట్టణంలోని ఒక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ బాలిక మతిస్థిమితం కోల్పోయినట్లు అపస్మారక స్థితిలో మాట్లాడటంతో, స్థానిక వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు.

### లైంగికదాడి నిర్ధారణ.. కరీంనగర్‌కు రిఫర్

మంచిర్యాల దవాఖానలో వైద్యులు బాలికను నిశితంగా పరిశీలిస్తున్న సమయంలో ఆమె భయంతో ప్రవర్తించిన తీరుపై అనుమానం వచ్చింది. దీంతో వైద్యులు తక్షణమే ఫిజికల్ టెస్టులు నిర్వహించగా.. బాలిక ఒంటిపై తీవ్రమైన గాయాలు ఉండటంతో పాటు విపరీతంగా రక్తస్రావం కావడం గమనించారు. సదరు బాలికపై అత్యంత క్రూరంగా లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించిన వైద్యులు, ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేశారు. అనంతరం మెరుగైన అత్యవసర చికిత్స కోసం బాలికను కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని సమాచారం.

### పరువు పేరుతో కప్పిపుచ్చే యత్నం!

ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడు బాలికకు అత్యంత సమీప బంధువేనని తెలుస్తోంది. అయితే అతడు గత కొంతకాలంగా నిత్యం ఇలాగే వేధిస్తున్నాడా, లేక ఆ రోజే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడా అనేది తేలాల్సి ఉంది. మరోవైపు, ఈ ఘటనను గోప్యంగా ఉంచేందుకు కొందరు పెద్దలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం బయటకు వస్తే కుటుంబంతో పాటు ఊరి పరువు పోతుందని, దీనిని ఇక్కడితోనే వదిలేయాలని బాధితుల కుటుంబానికి హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఎవరైనా ఈ విషయంపై ఆరా తీస్తే.. అలాంటిదేమీ జరగలేదని, కావాలనే పుకార్లు సృష్టిస్తున్నారని మభ్యపెడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

### పోలీసుల తీరుపై అనుమానాలు

ఈ అమానుష ఘటనలో పోలీసుల వ్యవహారశైలిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలికపై లైంగికదాడి జరిగినట్లు నిర్ధారించిన వెంటనే మంచిర్యాల వైద్యులు ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుంచి కాగజ్‌నగర్ పోలీసులకు సమాచారం చేరిందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ అధికారికంగా సమాచారం అందినా కూడా కాగజ్‌నగర్ పోలీసులు ఉద్దేశపూర్వకంగానే చర్యలు తీసుకోలేదా? నిందితుడిని కాపాడేందుకు ఎవరైనా ఒత్తిడి తెస్తున్నారా? అనే కోణంలో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# 14న కళాశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు




వరంగల్, జూలై 11 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న ఆలస్యాలను నిరసిస్తూ ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మదూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, ఆరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# ఎంత ఖర్చైనా నేనున్నా

### చిన్నారి ప్రాణాలకు రాజగోపాల్ రెడ్డి అభయం

మునుగోడు, జూలై 11 (ఈవార్తలు): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకొని ఒక నిరుపేద కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. తల్లిదండ్రులు లేక, తీవ్ర అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఒక చిన్నారికి తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పూర్తి ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చి పెద్ద మనసు చాటుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన మనవడిని బతికించాలంటూ ఒక వృద్ధుడు కన్నీరుమున్నీరవుతూ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని ఆశ్రయించారు. తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, ఆ చిన్నారి మాత్రమే తనకున్న ఏకైక ఆస్తి అని, ఎలాగైనా కాపాడాలని ఆ తాత ఎమ్మెల్యే కాళ్లపై పడి తన ఆవేదనను వెళ్లగక్కారు. ఆ వృద్ధుడి కష్టాన్ని చూసి చలించిపోయిన రాజగోపాల్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడటానికి ఎంత ఖర్చైనా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తమ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్ తో పాటు పూర్తి ఉచిత వైద్యం అందించి, బాబును మళ్లీ ఆరోగ్యంగా ఇంటికి పంపే బాధ్యత తనదేనని కొండంత భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న తమను దేవుడిలా ఆదుకోవడానికి ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆ వృద్ధుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది.

# మార్కెట్లోకి హీరో విడా కొత్త ఈ-స్కూటర్

### ఒక్క చార్జ్‌తో 187 కి.మీ. రేంజ్!




ముంబై: ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన ఎలక్ట్రిక్ బ్రాండ్ 'విడా' కింద మరో కొత్త స్కూటర్‌ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. అధిక రేంజ్ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని 'విడా వీఎక్స్2 ప్లస్ 4.4 కేడబ్ల్యూహెచ్' వేరియంట్‌ను ఆవిష్కరించింది. ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే ఈ స్కూటర్ 187 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ ప్రకటించింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర (న్యూఢిల్లీ) రూ. 1.44 లక్షలుగా నిర్ణయించారు. ఈ కొత్త స్కూటర్‌లో 2.2 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల రెండు రిమూవబుల్ బ్యాటరీ ప్యాక్‌లను అమర్చారు. దీని గరిష్ఠ వేగం గంటకు 90 కిలోమీటర్లు. కేవలం 3.1 సెకన్లలోనే 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. పోర్టబుల్ చార్జర్‌తో సుమారు 3 గంటల 30 నిమిషాల్లో 80 శాతం వరకు చార్జ్ చేయవచ్చు. అదే డీసీ ఫాస్ట్ చార్జర్‌తో అయితే కేవలం 65 నిమిషాల్లోనే 80 శాతం చార్జింగ్ పూర్తవుతుంది. ఫీచర్ల విషయానికొస్తే... ఇందులో 27.2 లీటర్ల అండర్ సీట్ స్టోరేజ్, డిస్క్, డ్రమ్ బ్రేక్స్, స్మార్ట్ కనెక్టివిటీ వంటి సదుపాయాలు ఉన్నాయి. కొనుగోలు భారాన్ని తగ్గించేందుకు 'బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్' మోడల్‌లో కూడా దీన్ని కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించారు. ఇంట్లోనే బ్యాటరీలను చార్జ్ చేసుకునే వెసులుబాటు ఉండటం వల్ల రేంజ్ గురించిన ఆందోళన తగ్గుతుందని కంపెనీ తెలిపింది. ఈ స్కూటర్ జులై చివరి నుంచి విడా డీలర్‌షిప్‌ల వద్ద అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఈ స్కూటర్ సిరీస్ సుదీర్ఘ ప్రయాణం చేసి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినట్లు కంపెనీ గుర్తుచేసింది.

# రేవంత్ 117 సీట్ల 'కల'

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా, బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా తమ వ్యూహాలను అమలు చేస్తున్నాయి. అయితే 2028లో లేదా తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రజలు అధికారం అప్పగిస్తారనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ఎన్నికల హామీల అమలుపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాల్సి ఉంటుంది. సంక్షేమ పథకాలతో పాటు ఆర్థిక క్రమశిక్షణ, ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతుల అభివృద్ధిలో స్పష్టమైన ఫలితాలు చూపాల్సి ఉంటుంది.

## ఎన్నికల హామీలపై ప్రజల్లో విశ్వాసం ఎంత?

## అభివృద్ధిలో మార్పు చూపించారా?



(దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

అదే సమయంలో బీఆర్ఎస్ గత పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలుగా భావిస్తున్న అంశాలను ఎన్నికల ప్రధాన అజెండాగా మార్చేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాలు, పట్టణ ఓటర్లు, యువత, జాతీయ రాజకీయ అంశాలను ముందుకు తెచ్చి తన విస్తరణకు కృషి చేసే అవకాశముంది. భారత రాజకీయాల్లో సంక్షేమ పథకాలు కీలక ఎన్నికల అంశంగా కొనసాగుతున్నాయి. అయితే ఓటర్లు ఇప్పుడు కేవలం హామీలను మాత్రమే కాదు, వాటి అమలును కూడా పరిశీలిస్తున్నారు. ఉచిత పథకాలు అవసరమైన వర్గాలకు రక్షణ కల్పించినా, రాష్ట్ర ఆర్థిక సామర్థ్యానికి అనుగుణంగా వాటి అమలు జరగడం కూడా అంతే ముఖ్యం. సంక్షేమం మరియు అభివృద్ధి మధ్య సమతుల్యతను సాధించిన ప్రభుత్వాలకే దీర్ఘకాలిక ప్రజా మద్దతు లభించే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డీలిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య మారే అవకాశం ఉందనే చర్చ ఉన్నప్పటికీ, దాని పరిధి, సమయం, సీట్ల సంఖ్యపై ఇప్పటివరకు అధికారిక నిర్ణయం లేదు. కొత్త నియోజకవర్గాలు ఏర్పడినా, చివరకు ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది స్థానిక సమస్యలు, అభ్యర్థుల బలం, ప్రభుత్వ పనితీరు, ప్రజల విశ్వాసమే.

### ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ప్రజలదే

ప్రజాస్వామ్యంలో గెలిచేది కేవలం ఒక పార్టీ కాదు... ప్రజల విశ్వాసం. ఎన్నికల హామీలు ఇవ్వడం సులభం. వాటిని ఆర్థికంగా నిలబెట్టుకుంటూ అమలు చేయడం అసలు సవాలు. అలాగే ప్రతిపక్షాల బాధ్యత కూడా కేవలం విమర్శించడం కాకుండా, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడం. ఓటు అనేది తాత్కాలిక ప్రయోజనాల కోసం కాదు, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే రాజ్యాంగ హక్కు. సంక్షేమం అవసరమే, కానీ అది స్వయం సమృద్ధికి దారి తీసేలా ఉండాలి. నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, రైతుకు గిట్టుబాటు ఆదాయం, యువతకు ఉపాధి, పారదర్శక పాలన, బలమైన మౌలిక సదుపాయాలు.. ఇవే ప్రజలు ప్రభుత్వాలను అంచనా వేసే ప్రధాన ప్రమాణాలు. 117 సీట్ల లక్ష్యం రాజకీయ నినాదం కావచ్చు. అది వాస్తవమవుతుందా లేదా అనేది ఎన్నికల సమయానికి ప్రజలు ప్రభుత్వ పనితీరును ఎలా అంచనా వేస్తారన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. చివరికి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది ఏ సర్వే కాదు, ఏ ప్రచారం కాదు... ఓటరు వేసే ఒక్క ఓటే.



## తెలంగాణకు 3 బుల్లెట్ ట్రైన్లు

### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో, ఏకంగా మూడు రూట్లు తెలంగాణకే దక్కడం విశేషమని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ వల్లే రాష్ట్రానికి ఈ భారీ ప్రాజెక్టులు వచ్చాయని, రాబోయే రోజుల్లో తెలంగాణ దేశంలోనే ఒక పెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్‌గా అవతరించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విప్లవాత్మక ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయాలు ఊహించని విధంగా తగ్గిపోతాయన్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరవాసులకు ఈ రైళ్లతో ప్రయాణ కష్టాలు పూర్తిగా తీరిపోనున్నాయి. బుల్లెట్ రైలు ఎక్కితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం ఒక గంట పది నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. అలాగే వ్యాపార రాజధాని ముంబైకి రెండు గంటల ఇరవై నిమిషాలు, అటు చెన్నై నగరానికి కేవలం రెండు గంటల్లోనే దూసుకుపోవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ దేశ రవాణా రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇదే గ్యాప్‌లో ఈ ప్రాజెక్టుల క్రెడిట్ కోసం కొందరు పాకులాడుతున్నారంటూ విపక్షాలపై మంత్రి మండిపడ్డారు. దీని పూర్తి క్రెడిట్ ప్రధాని మోదీకే దక్కుతుందని, గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో కేవలం రూ. 800 కోట్లు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం ఒక్క తెలంగాణకే ఏకంగా రూ. 5000 కోట్ల రైల్వే నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ నిధుల వరద వల్లే రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయనిస్పష్టం చేశారు.

## ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో సరికొత్త ఫీచర్లు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైలు ప్రయాణికులకు శుభవార్త. రైలు టికెట్ల బుకింగ్ కోసం వినియోగించే ఐఆర్‌సీటీసీ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్‌ను భారతీయ రైల్వే శాఖ సమూలంగా మారుస్తోంది. ఇందులో భాగంగా సరికొత్త ఫీచర్లతో మరింత వేగంగా, సులభంగా పనిచేసేలా రూపొందించిన కొత్త వెబ్‌సైట్ బీటా వెర్షన్‌ను జులై 15న ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం ఉన్న వెబ్‌సైట్‌తో పోలిస్తే ఇది చాలా వేగంగా, ఎలాంటి గందరగోళం లేకుండా పనిచేస్తుందని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసేటప్పుడు తరచూ క్యాప్చాలు రావడం, అనవసరమైన పాపప్‌లు, బుకింగ్‌లో జాప్యం వంటి సమస్యలు ఉన్నాయని జైపూర్‌లోని మాలవీయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఐటీ) విద్యార్థులు గతంలో రైల్వే శాఖ దృష్టికి తీసుకెళ్లారు. గత నెలలో వారితో జరిగిన సమావేశంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, వెబ్‌సైట్‌ను తప్పకుండా ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే, ఐఆర్‌సీటీసీ, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (సీఆర్ఐఎస్) అధికారులు శుక్రవారం జైపూర్‌లో విద్యార్థులకు కొత్త బీటా వెర్షన్‌ను ప్రదర్శించి, వారి నుంచి మరిన్ని సూచనలు స్వీకరించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు స్పష్టం చేశారు.

## కర్ణాటకలో పాక్ తల్లి, కొడుకు అరెస్ట్

చిక్కబళ్లాపూర్: కర్ణాటకలో గత 22 ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులైన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకాలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీసా గడువు ముగిసినప్పటికీ దేశం విడిచి వెళ్లకుండా, నకిలీ పత్రాలు ద్వారా భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందారనే ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నారు. బాగేపల్లి సమీపంలోని దాసగరిపల్లి గ్రామంలో నివసిస్తున్న ఫర్హానాజ్ (52), ఆమె కుమారుడు మహమ్మద్ ఫర్దీన్ (21) రేషన్ కార్డు పొందడంతో పాటు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన పత్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు అనుమానం కలగడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారు భారత పౌరసత్వం లేని పాకిస్థాన్ జాతీయులని నిర్ధారణ అయింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, పాకిస్థాన్ జాతీయురాలైన ఫర్హానాజ్‌కు, దాసగరిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అయూబ్ ఖాన్‌తో 2003లో వివాహం జరిగింది. వీరి కుమారుడు ఫర్దీన్ పాకిస్థాన్‌లోనే జన్మించాడు. అనంతరం కొన్నాళ్లకు ఈ కుటుంబం భారత్‌లో స్థిరపడింది. అయితే, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా వారు పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుండా, బెంగళూరు చిరునామాలను ఉపయోగించి నకిలీ ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బ్యాంకు ఖాతాలు కూడా పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తల్లికొడుకులను అరెస్టు చేశారు. ఈ నకిలీ పత్రాల జారీ వెనుక ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## కుళ్లిన గుడ్లు, పాడైన ఆహారం డెలివరీ

### స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు ఫుడ్ సేఫ్టీ అథారిటీ వార్నింగ్



న్యూఢిల్లీ: ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌కు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) షాక్ ఇచ్చింది. వినియోగదారుల నుంచి వచ్చిన అనేక ఫిర్యాదుల నేపథ్యంలో స్విగ్గీకి ఏకంగా తొమ్మిది నోటీసులు జారీ చేసినట్టు శనివారం వెల్లడించింది. గడువు ముగిసిన, పాడైపోయిన, కుళ్లిపోయిన, కలుషితమైన, అసురక్షిత ఆహార పదార్థాలను తమ ప్లాట్‌ఫామ్ ద్వారా సరఫరా చేస్తున్నారంటూ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌లో ఆమోదం లేని బ్రాండ్ పేరుతో గుడ్లను విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని రెగ్యులేటరీ సంస్థ పేర్కొంది. సరైన లైసెన్స్ పొందే వరకు ఆ ఉత్పత్తిని మార్కెట్ చేయవద్దని 'ఫుడ్ బిజినెస్ ఆపరేటర్' (ఎఫ్‌బీఓ) అయిన స్విగ్గీని ఆదేశించింది. అంతేకాకుండా 'హెల్తీఫై 100% వే ప్రోటీన్ 1 కేజీ', 'నాయిస్ హోమ్‌స్టైల్ మద్రాస్ మిక్చర్ విత్ పీనట్స్' వంటి ఉత్పత్తులను వాటి గడువు తేదీ ముగిసిన తర్వాత కూడా వినియోగదారులకు సరఫరా చేసినట్టు వచ్చిన ఫిర్యాదులను కూడా నోటీసుల్లో ప్రస్తావించింది. మరో తీవ్రమైన ఘటనలో.. 'అక్షయకల్ప ఆర్గానిక్ ఎగ్' గడువు ముగిసి, కుళ్లిపోయి, దుర్వాసన వెదజల్లుతూ, కలుషితమైనట్టుగా గుర్తించారు. ఇది మానవ వినియోగానికి ఏమాత్రం పనికిరాదని తేలింది. అదేవిధంగా, 'కక్కే దా పరాఠా' అనే ఉత్పత్తి కూడా పాడైపోయి, దుర్వాసనతో ఉన్నట్టు ఫిర్యాదు అందింది. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, శిశువుల కోసం ఉద్దేశించిన ఒక ఫుడ్ ఫార్ములేషన్ పాడైపోయిందని వినియోగదారుడు వెనక్కి పంపితే, అదే ఉత్పత్తిని మళ్లీ తిరిగి సరఫరా చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఫిర్యాదు చేసినప్పటికీ స్విగ్గీ ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకోలేదని కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర వివరణ ఇవ్వాలని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలు, నాణ్యత హామీ వ్యవస్థలు, దిద్దుబాటు చర్యల వివరాలను సమర్పించాలని కోరింది. నిర్దేశిత గడువులోగా సంతృప్తికరమైన వివరణ ఇవ్వడంలో విఫలమైతే.. 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్-2006' ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టంగా హెచ్చరించింది.

## ప్రపంచ వాయుసేనల్లో భారత్ నం.3

### చైనాను అధిగమించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన (ఐఏఎఫ్) మరోసారి తన సత్తా చాటింది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యుడీఎంఎంఏ) విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో వరుసగా ఐదో ఏడాది కూడా చైనాను వెనక్కి నెట్టి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన వివిధ వైమానిక విభాగాలు అగ్రస్థానంలో ఉండగా, రష్యా రెండో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో, స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా విశ్లేషిస్తే అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత్ నిలిచినట్లవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. డబ్ల్యుడీఎంఎంఏ 'ట్రూ వాల్యూ రేటింగ్' (టీవీఆర్) ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించింది. ఇందులో భారత వాయుసేన 69.4 పాయింట్ల స్కోరు సాధించగా, చైనా వాయుసేన 63.8 స్కోరుతో వెనుకంజలో ఉంది. కేవలం విమానాల సంఖ్యనే కాకుండా వాటి సాంకేతిక సామర్థ్యం, పైలట్ల శిక్షణ, లాజిస్టిక్స్, భవిష్యత్ ప్రణాళికలు, ఆధునికీకరణ వంటి కీలక అంశాలను డబ్ల్యుడీఎంఎంఏ పరిగణనలోకి తీసుకుంది. భారత వాయుసేన వద్ద సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. ఇందులో ఫైటర్ జెట్లు, హెలికాప్టర్లు, రవాణా విమానాలు సమతూకంలో ఉండటం వల్లే చైనా కంటే మెరుగైన ర్యాంకు లభించింది. అయితే, భారత వాయుసేన ముందు ప్రస్తుతం కొన్ని సవాళ్లు ఉన్నాయి. దేశ రక్షణకు అవసరమైన 42 ఫైటర్ స్క్వాడ్రన్లకు బదులుగా ప్రస్తుతం 29 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేసేందుకు 180 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల కొనుగోలుతో పాటు, స్వదేశీ పరిజ్ఞానంతో యుద్ధ విమానాల తయారీని ప్రభుత్వం వేగవంతం చేస్తోంది.

## ఇన్‌స్టాగ్రామ్‌లో 'మ్యూజ్ ఇమేజ్' తొలగింపు!

న్యూయార్క్: సోషల్ మీడియా దిగ్గజం మెటాకు యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫీచర్‌ను, ప్రారంభించిన కొద్ది రోజులకే ఉపసంహరించుకుంది. యూజర్ల ప్రైవసీ, వారి కంటెంట్ వినియోగంపై తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తడంతో మెటా ఈ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని 'టెక్‌క్రంచ్' తన కథనంలో మొదటగా వెల్లడించింది. 'మ్యూజ్ ఇమేజ్' పేరుతో మెటా తీసుకొచ్చిన ఈ కొత్త టూల్ ద్వారా, ఇన్‌స్టాగ్రామ్‌లోని పబ్లిక్ అకౌంట్ల ఫొటోలను ఉపయోగించి యూజర్లు ఏఐ చిత్రాలను సృష్టించవచ్చు. ప్రాంప్ట్‌లో ఒక పబ్లిక్ అకౌంట్‌ను మెన్షన్ చేస్తే చాలు, ఆ అకౌంట్‌లోని ఫొటోల ఆధారంగా కొత్త ఏఐ చిత్రాలు జనరేట్ అవుతాయి. అయితే, ఈ ఫీచర్ యూజర్ల అనుమతి లేకుండానే డీఫాల్ట్‌గా ఎనేబుల్ అవ్వడం పెను దుమారానికి కారణమైంది. తమ పబ్లిక్ ఫొటోలను ఏఐ కోసం వాడకూడదనుకునే వారు, సెట్టింగ్స్‌లోకి వెళ్లి మాన్యువల్‌గా ఈ ఫీచర్‌ను ఆఫ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. విమర్శలు పెరుగుతుండటంతో మెటా వెంటనే స్పందించింది. యూజర్లకు తమ పబ్లిక్ కంటెంట్‌పై నియంత్రణ ఇస్తూనే, ఒక సృజనాత్మక టూల్‌ను అందించాలనేది తమ ఉద్దేశమని, కానీ ఈ విషయంలో తాము విఫలమయ్యామని అంగీకరించింది. అందుకే ఈ ఫీచర్‌ను పూర్తిగా అందుబాటులో లేకుండా చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఫీచర్‌పై కేవలం యూజర్లే కాకుండా ప్రైవసీ హక్కుల కార్యకర్తలు, నటీనటులు, మీడియా నిపుణుల సంఘాలు కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ముఖ్యంగా నటుల యూనియన్ 'శాగ్-ఆఫ్ట్రా', వ్యక్తుల చిత్రాలను ఏఐ కోసం వాడే ముందు స్పష్టమైన అనుమతి తీసుకోవాలని, లేకపోతే వారి అనుమతి లేకుండానే డిజిటల్ ప్రతిరూపాలను సృష్టించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ సంఘటనతో ఏఐ ఉత్పత్తుల విషయంలో పారదర్శకంగా ఉండాలని, యూజర్ల డేటా వినియోగంపై వారికి పూర్తి నియంత్రణ ఇవ్వాలన్న డిమాండ్ టెక్ కంపెనీలపై మరింత బలపడుతోంది.

## 15 నాటికి అందరి ఖాతాల్లో పీఎఫ్ వడ్డీ

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన చందాదారులకు తీపి కబురు అందించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ 8.25 శాతం వడ్డీని ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 34 కోట్ల మంది సభ్యుల ఖాతాల్లోకి వడ్డీ సొమ్ము జమ కానుంది. 2026 జులై 15 నాటికి సభ్యులందరి పాస్‌బుక్‌లలో అప్‌డేట్ అయిన బ్యాలెన్స్ కనిపిస్తుందని అధికారులు వెల్లడించారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించారు. కొత్తగా ప్రవేశపెట్టిన కేంద్రీకృత ఐటీ ఆధారిత సేవల (సీఐటీఈఎస్) వ్యవస్థ ద్వారా రూ.1.44 లక్షల కోట్లకు పైగా వడ్డీని ఆటోమేటిక్‌గా ప్రాసెస్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో వడ్డీ జమ ప్రక్రియ అక్టోబర్ లేదా నవంబర్ వరకు ఆలస్యమయ్యేదని, అయితే సరికొత్త సాంకేతికతతో ఈసారి ప్రక్రియ అత్యంత వేగంగా పూర్తవుతోందని ఆయన పేర్కొన్నారు. జులై 11 నాటికే సుమారు 80 శాతం ఖాతాల్లో వడ్డీ జమ అయినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మిగిలిన ఖాతాలకు కూడా జులై మధ్య నాటికి ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ తమ ఖాతాలో వడ్డీ వెంటనే కనిపించకపోయినా సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సిస్టమ్ అప్‌డేట్ అవుతున్నందున కొద్ది రోజుల్లో బ్యాలెన్స్ కనిపిస్తుందని అధికారులు సూచించారు.

## ఏఐ వచ్చినా.. గెలిచేది సైనికులే

### కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

వైజాగ్, జూలై 11 (ఈవార్తలు): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని మారుస్తున్నప్పటికీ, అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది సంప్రదాయ సైనిక సామర్థ్యాలు, శిక్షణ పొందిన సైనికులు, దేశ సంకల్పమేనని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' యుద్ధనౌకను నౌకాదళంలోకి ప్రవేశపెట్టిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవిష్యత్ యుద్ధాలు ఏఐతో జరగవచ్చేమో గానీ, వాటిని గెలిచేది మాత్రం మన సైనికులు, విశ్వసనీయ సైనిక బలంతోనేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "నూతన సాంకేతికతలు యుద్ధ స్వభావాన్ని మార్చిన మాట వాస్తవమే. కానీ, సంప్రదాయ యుద్ధ సామర్థ్యాల ప్రాధాన్యతను అవి ఏమాత్రం తగ్గించలేదు. యుద్ధం ప్రాథమిక సూత్రాలను నెరవేర్చడానికి బలమైన సంప్రదాయ సామర్థ్యాలు నేటికీ ఎంతో అవసరం. కేవలం కొత్త టెక్నాలజీపై ఆకర్షణతో సంప్రదాయ సైనిక శక్తిని నిర్లక్ష్యం చేసిన దేశాలు భారీ మూల్యం చెల్లించుకున్నాయని చరిత్ర మనకు గుర్తుచేస్తోంది" అని వివరించారు. నూతన టెక్నాలజీ, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీ కాదని, అవి పరస్పర పూరకాలు అని రక్షణ మంత్రి తెలిపారు. "ఒక సంప్రదాయ వేదిక కొత్త టెక్నాలజీ లేకుండా బలహీనపడుతుంది, అదే సమయంలో టెక్నాలజీకి ఒక వేదిక అవసరం. అందుకే, రెండు రంగాల్లోనూ రాణిస్తూ, వాటి మధ్య సమతుల్యం పాటించాలనేది భారత విధానం. భవిష్యత్ సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, మన సంప్రదాయ సామర్థ్యాలను నిరంతరం పదునుపెట్టుకుంటాం. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఈ సంకల్పానికి, నిబద్ధతకు ప్రతీక" అని ఆయన అన్నారు.

## మా నాన్న మృతికి ప్రతీకారం తప్పదు

### మొజ్తబా ఖమేనీ ప్రకటన

టెహ్రాన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ శపథం చేశారు. టెలిగ్రామ్ ద్వారా విడుదల చేసిన సందేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన తండ్రి మృతికి కారకులైన వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని మొజ్తబా హెచ్చరించారు. తన నాయకుడితో పాటు అమరులైన వారి తరఫున హంతకులపై ప్రతీకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే దాడిలో తీవ్రంగా గాయపడిన మొజ్తబా.. జులై 9న జరిగిన తన తండ్రి అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయారు.



## ప్రజా సమస్యలపై ప్రత్యేక పాదయాత్ర నేడు

కూకట్‌పల్లి, జూలై 11 (ఈవార్తలు):కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వసంతనగర్ డివిజన్ పరిధిలోని డ్రీమ్ వ్యాలీలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆదివారం ఉదయం ప్రత్యేక పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పాదయాత్రలో పాల్గొని స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా విభాగం నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, మైనారిటీ సెల్, ఎస్సీ సెల్, బీసీ సెల్, సేవాదళ్, సోషల్ మీడియా విభాగం నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం పిలుపునిచ్చింది. మీడియా ప్రతినిధులు కూడా కార్యక్రమానికి హాజరై కవరేజ్ అందించాలని నిర్వాహకులు కోరారు.

## కొండగట్టు అంజన్న ఆలయ కొత్త ముఖద్వారం ప్రారంభం

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



మల్యాల, జూలై 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ప్రధాన ముఖద్వారాన్ని స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ప్రత్యేక పూజల నడుమ ప్రారంభించారు. ఆలయంలోని పాత ప్రధాన ముఖద్వారం శిథిలావస్థకు చేరుకోవడంతో, భక్తుల సౌకర్యం, భద్రతతో పాటు ఆలయ సౌందర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థాన అధికారులు నూతన ముఖద్వారాన్ని నిర్మించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖద్వారాన్ని ప్రారంభించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. అంజనారెడ్డి, ఏఈఓ హరిహారనాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, అర్చకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు బీఆర్ఎస్ అవగాహన

జగిత్యాల, జూలై 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎల్. రమణ, జగిత్యాల జిల్లా తొలి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొని ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై అవగాహన కల్పించారు. తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన ఓటరు జూలై 24లోగా ఎస్ఐఆర్ దరఖాస్తు సమర్పించాలని, ఆధార్‌కు అనుగుణంగా ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం యాప్‌ను వినియోగించుకొని బీఎల్‌వోలు, పార్టీ బీఎల్ఏలు సమన్వయంతో పని చేసి ప్రతి ఓటరిని నమోదు చేయించాలని కోరారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ నిజమైన ఓటర్ల హక్కులను కాపాడేందుకు పార్టీ కట్టుబడి ఉందన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు. దావ వసంత సురేష్ మాట్లాడుతూ జగిత్యాలలో ఎస్ఐఆర్ నమోదు శాతం ఇంకా తక్కువగా ఉందని, అధికారులు మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

## ధరణి, భూ భారతి పోర్టల్‌లు దొందూ దొందే

**అక్రమ భూ బదలాయింపులపై సమగ్ర విచారణ జరపాలి**

**బీజేపీ నాయకుడు మామిడిపెల్లి ప్రసాద్**



జగిత్యాల, జూలై 11 (ఈవార్తలు): రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి పోర్టల్ రెండూ ఒకే తీరుగా పనిచేస్తున్నాయని బీజేపీ జిల్లా నాయకుడు మామిడిపెల్లి ప్రసాద్ ఆరోపించారు. ఈ రెండు పోర్టల్‌ల ద్వారా పేదల భూములు భారీ స్థాయిలో అక్రమాలకు గురయ్యాయని ఆయన విమర్శించారు. పోర్టల్స్ అమల్లోకి వచ్చిన తర్వాత రైతులు తమ భూముల వివరాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఉమ్మడి వెల్గటూర్ మండలంలో కొందరు రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి అసలు భూ యజమానులకు తెలియకుండా రికార్డుల్లో పేర్లు తొలగించి, తమ బంధువులు, అనుచరుల పేర్లపై అక్రమంగా భూ బదలాయింపులు చేయించుకున్నారని ఆరోపించారు. దీంతో అసలు భూ యజమానులు తమ భూములను తిరిగి రికార్డుల్లో నమోదు చేయించుకునేందుకు జిల్లా, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ దరఖాస్తులు సమర్పిస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆయన అన్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ భూ బదలాయింపులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, భూ రికార్డులను సరిచేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని మామిడిపెల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు.





## ఎములాడ రాజన్నా.. పార్కింగ్ ఎక్కడ?

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ పుణ్యక్షేత్రంలో చిన్నపాటి వర్షానికే గుడి పార్కింగ్ స్థలంలో నీరు చేరి ఆ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది గా మారింది. అయినా, దీనిపై అధికారులు చర్యలు చేపట్టకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతోంది. వెంటనే ఈవో, మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలి అని భక్తులు కోరుతున్నారు. నీరు నిలిచిపోవడంతో అక్కడి ప్రాంతం కంపుకొడుతోందని మండిపడుతున్నారు.

- వేములవాడ అర్బన్, జూలై 11 (ఈవార్తలు)

# ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



వేములవాడ/మల్యాల, జూలై 11 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర–భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, స్వామివారికి జోడీ కోడెమొక్కు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, బండి సంజయ్ దీర్ఘాయుష్షుతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు, కరీంనగర్ పార్లమెంట్ పరిధి ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా భగవంతుడు ఆశీర్వదించాలని ప్రార్థించారు. కౌన్సిలర్లు కుమ్మరి శంకర్, కండ్లేపు ముత్యం, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ, బండి సంజయ్ ఆరోగ్యంగా ఉండి రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేసేలా రాజరాజేశ్వర స్వామి ఆశీర్వదించాలని కోరుకున్నారు. బీజేపీ నాయకుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, వేములవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేగుల రాజ్‌కుమార్, జిల్లా నాయకులు రేగుల మల్లికార్జున్, మహిళా మోర్చా నాయకురాలు రాధిక, డాక్టర్ వెంకన్న, పట్టణ కమిటీ నాయకులు అన్నం నరసయ్య, బిల్ల కృష్ణ, రేడికింది అశోక్, చిక్కుడు మల్లేశం, నామాల శేఖర్, సగ్గు రాహుల్, కిరణ్, హరీష్, అభిషేక్, జగన్నాథం, శ్రీనివాస్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అటు.. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండగట్టు దిగువన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. అలాగే ధరూర్ క్యాంపులోని వాల్మీకి ఆవాసంలో నిరుపేద పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండి దేశసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా సంక్షేమం, జాతీయ అభివృద్ధి కోసం ఆయన మరింతకాలం సేవలందించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, పార్టీ బలోపేతంలో బండి సంజయ్ నాయకత్వం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంకుర్తి తిరుపతి, గడ్డం నడిపి మల్లేశం, బొట్ల ప్రసాద్, కొల్లూరు గంగాధర్, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కటకం లత, బీజేవైఎం మండల అధ్యక్షుడు పొన్నగంటి గౌతం, గుగ్గిళ్ల గంగరాజ్, దాసరి విజయ్ కుమార్, కుసుమ సాయికుమార్, వంశీ, హరీష్, అనిల్, పరశురాం, మైపాల్ రెడ్డి, పొన్నగంటి రమేష్, బూత్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జగిత్యాల పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్‌లో బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను శనివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు ముదిగంటి రవీందర్ రెడ్డి కేక్ కట్ చేసి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బండి సంజయ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, దేశాభివృద్ధి, జాతీయవాద భావజాలం, ప్రజాసేవలో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో ప్రజలకు మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి, ఏసీఎస్ రాజు, సిపెల్లి రవీందర్, కౌన్సిలర్ అరవ లక్ష్మి, రగిల్లా సత్యనారాయణ, లింగంపేట శ్రీనివాస్, కొండ లక్ష్మణ్, ఆంకర్ సుధాకర్, చీటీ శేఖర్ రావు, కిషోర్ సింగ్, బాశెట్టి ప్రభాకర్, కట్ట విజయ్, ద్యావనలెల్లి జ్ఞానేశ్వర్, లింగాల శ్రీకాంత్ రావు, ఎడమల వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గోగికర్ మహేందర్, గొడిశెల నాగరాజు, బుర్ర ప్రమోద్, సబ్బ దేవరాజం, కుర్మచలం సతీష్, ఎర్ర శ్రీనివాస్, కృష్ణ, పదం మహేందర్, బిట్టుతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో కేవీకి భూమిపూజ నేడు

**వర్సిటీ కోసం 8 నెలలుగా కృషి.. పాత ఎస్పీ కార్యాలయంలోనే తరగతులు**




జగిత్యాల, జూలై 11 (ఈవార్తలు): జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గత ఎనిమిది నెలలుగా నిరంతర కృషి చేస్తున్నామని, శనివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. శనివారం మోతే రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయింపులో కొంత జాప్యం జరిగిందని, వాలంటరీ సంస్థ అటానమస్ విధానంలో ఉండటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహజ వ్యవసాయంపై దృష్టి సారించడంతో భూకేటాయింపు ఆలస్యమైందని వివరించారు. కేంద్రీయ విద్యాలయంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కూడా తక్కువ స్థలం కేటాయించారని గుర్తు చేశారు. దేశంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు అయ్యాయని, ఇది సీబీఎస్ఈ విధానంలో నడిచే పాఠశాల మాత్రమేనని, దీనిని కేంద్రీయ విశ్వవిద్యాలయంగా పేర్కొనడం సరికాదన్నారు. మాజీ ఎంపీ అరవింద్ హయాంలోనే కేంద్రీయ విద్యాలయం మంజూరైందని, జగిత్యాలకు నవోదయ విద్యాలయం కోరగా కోరుట్లలో ఏర్పాటు చేశారని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్, కరీంనగర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కలిసి పాత ఎస్పీ కార్యాలయ భవనాన్ని పరిశీలించి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఆరు నెలల క్రితమే భవనాన్ని కేటాయించగా, చల్‌గల్‌లో ఐదు ఎకరాల భూమికి జిల్లా కలెక్టర్ అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చారని చెప్పారు. శాశ్వత కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం అవసరమని, అందుకోసం మంత్రి లక్ష్మణ్ కుమార్ కూడా కృషి చేశారని తెలిపారు. తాను చేసిన ప్రయత్నాలకు పూర్తి ఆధారాలు ఉన్నాయని, ఈ విషయంలో కొందరు తామే పోరాటం చేశామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పాఠశాల భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు ఎంపీ చొరవ చూపాలని, రెగ్యులర్ సిబ్బందితో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జగిత్యాల అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయ భేదాభిప్రాయాలు లేవని, మంత్రులు, ఎంపీతో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, కౌన్సిలర్లు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు వెల్లుల్ల విద్యార్థిని ఎంపిక

**1000 మీటర్ల పరుగు పందెంలో జిల్లా ప్రథమ స్థానం**



మెట్‌పల్లి, జూలై 11 (ఈవార్తలు): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మోక్ష రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోరుట్ల మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో మోక్ష 1000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విద్యార్థినిని సన్మానించి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని మోక్ష నిరూపించిందని కొనియాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లా, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మోక్ష విజయం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.



## గురుకులంలో పురుగుల భోజనం..!

**నలుగురు విద్యార్థినులు అస్వస్థత**

**ప్రిన్సిపాల్‌పై చర్యలు కోరుతూ తల్లిదండ్రుల ధర్నా**

మెట్‌పల్లి, జూలై 11 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో నాసిరకం ఆహారం వడ్డించడంతో నలుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన శనివారం కలకలం రేపింది. పురుగులు పట్టిన అన్నం, కుళ్లిపోయిన కూరగాయలతో వండిన ఆహారం వడ్డిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆందోళనకారులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న మండల విద్యాధికారి (ఎంఈఓ) కనుకతార పాఠశాలకు చేరుకుని స్టోర్‌రూమ్, వంటగదిని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులతో మాట్లాడి ఆహార నాణ్యతపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఎంఈఓ ఇచ్చిన రాతపూర్వక హామీతో తల్లిదండ్రులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. అయితే, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.




## అల్ఫోర్స్ పాఠశాలలో నమూనా ఎన్నికలు

మల్యాల, జూలై 11 (ఈవార్తలు): మల్యాలలోని అల్ఫోర్స్ ఎన్‌ఎస్‌వీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రజాస్వామ్య ఎన్నికల విధానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో నమూనా (మాక్) ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్, లక్ష్య, ధ్రువ్, తేజస్ హౌస్‌ల విద్యార్థులు తమ హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌లను ఎన్నుకునేందుకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలనే లక్ష్యంతో అల్ఫోర్స్ పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి ఏడాది నమూనా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల ఫలితాల్లో సరస్ హౌస్ కెప్టెన్‌గా ఎస్. సాయి ప్రహర్ష, వైస్ కెప్టెన్‌గా టి. అశ్విత్ రెడ్డి, ధ్రువ్ హౌస్ కెప్టెన్‌గా ఎస్. హిమవర్షిణి, వైస్ కెప్టెన్‌గా ఎం. సమన్విత్ రెడ్డి, లక్ష్య హౌస్ కెప్టెన్‌గా జె. సాత్విక, వైస్ కెప్టెన్‌గా ఎస్. వరుణ్ రెడ్డి, తేజస్ హౌస్ కెప్టెన్‌గా ఎం.డి. సానియా, వైస్ కెప్టెన్‌గా కె. రిష్విక్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన విద్యార్థులను చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించి, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు.


## మేడిపల్లి సత్యంకు అభినందనల వెల్లువ

మల్యాల, జూలై 11 (ఈవార్తలు): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను అసెంబ్లీ ఎస్సీ కమిటీ చైర్మన్గా నియమించిన సందర్భంగా శనివారం మల్యాల మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మల్యాల మేజర్ ఉపసర్పంచ్ కటకం వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, మేడిపల్లి సత్యం ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

వయ్యారి చిత్రం



అమైరా దస్తూర్




## 24న రామాయణ ట్రైలర్

ఇండియన్ సినిమా హిస్టరీలోనే మోస్ట్ అవేటెడ్ మూవీగా నిలుస్తున్న 'రామాయణ' సినిమా నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), రాకింగ్ స్టార్ యష్ (రావణాసురుడు) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం యొక్క అఫీషియల్ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. జూలై 24న ఈ మూవీ ట్రైలర్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వేలాది సంవత్సరాలుగా భారతదేశ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచిన రామాయణాన్ని ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా సరికొత్తగా చూపించబోతున్నారు. హాలీవుడ్ రేంజ్ విజువల్ ఎఫెక్ట్స్, భారీ నిర్మాణ విలువలతో నమిత్ మల్హోత్రా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే ముందెన్నడూ చూడని విధంగా, ఊహించని రేంజ్ బడ్జెట్‌తో ఈ సినిమా రెడీ అవుతోంది. దేశం గర్వించే ఈ గొప్ప ఇతిహాసాన్ని వరల్డ్ వైడ్ ఆడియన్స్ ముందుకు గ్రాండ్‌గా తీసుకురాబోతున్నారు. కాగా, ఈ క్రేజీ మూవీ పార్ట్-1 ను ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

## పావలా శ్యామలకు తప్పని కష్టాలు



ఒకప్పటి సినీ నటి పావలా శ్యామల, ఆమె కుమార్తె మాధవిని గుర్తుతెలియని వ్యక్తులు హైదరాబాద్‌లోని ఒక ఆసుపత్రిలో వదిలివెళ్లిన ఘటన కలకలం సృష్టించింది. గురువారం ఎర్రగడ్డలోని ప్రభుత్వ చెస్ట్ ఆసుపత్రి వద్ద వారిని వదిలి వెళ్లగా, పోలీసులు శుక్రవారం వారిని ఒక అనాథాశ్రమానికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. గుర్తుతెలియని వ్యక్తులు తల్లికూతుళ్లను ఆసుపత్రి ప్రాంగణంలో వదిలి వెళ్లారు. వారిని గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా, టీబీ పరీక్షల్లో నెగటివ్ అని తేలింది. అయితే ఇతర అనారోగ్య సమస్యల దృష్ట్యా మెరుగైన చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఉస్మానియా ఆసుపత్రిలో ఉండటానికి పావలా శ్యామల, ఆమె కుమార్తె విముఖత చూపినట్లు తెలుస్తోంది. దీంతో వారు సాయంత్రానికి తిరిగి చెస్ట్ ఆసుపత్రికే చేరుకున్నారు. ఈ క్రమంలో ఆసుపత్రి అధికారులు బోరబండ పోలీసులకు సమాచారం అందించారు.



## షూటింగ్‌లో రాశీఖన్నాకు గాయం

బిజీ కథానాయిక రాశి ఖన్నా షూటింగ్ సెట్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం టాలీవుడ్ కంటే తమిళ్, హిందీ ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాశి ఖన్నాకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు దెబ్బలు తగిలినప్పటికీ, రాశి ఖన్నా ఎక్కడా బ్రేక్ తీసుకోలేదు. తన వల్ల షూటింగ్‌కు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గాయంతోనే ఆ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఒక ఫీమేల్ యాక్టర్‌ై ఉండి కూడా డూప్ లేకుండా క్లిష్టమైన స్టంట్స్ చేయడం, ఆమె అంకితభావాన్ని చూసి నెటిజన్లు, అభిమానులు సెల్యూట్ చేస్తున్నారు. ఇక తెలుగు సినిమాల విషయానికి వస్తే.. రాశి ఖన్నా ఇటీవల నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది.

### నా చివరి సినిమా కూడా
## తెలుగులోనే: భాగ్యశ్రీ

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం ఇవాళ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అభిమానులకు, చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది అభిమానుల ప్రోత్సాహమేనని ఆమె ఉద్వేగంగా అన్నారు. ఈ సందర్భంగా భాగ్యశ్రీ మాట్లాడుతూ.. "ఈ రోజు నేను చాలా ఎమోషనల్‌గా ఉన్నాను. అందుకే నా మనసులో ఉన్నది మాట్లాడాలనుకుంటున్నాను. నేను ఈ రోజు ఇక్కడ ఉండటానికి కారణమైన వ్యక్తి, మా దర్శకుడు మురళి కిశోర్ గారికి ముందుగా ధన్యవాదాలు చెప్పాలి. మీరు నాకు 'భారతి' పాత్ర ఇవ్వకపోయి ఉంటే, ఈ రోజు నాకు ఇంతటి ప్రశంసలు దక్కేవి కావు. నా మీద నమ్మకం ఉంచి, నన్ను భారతిగా తెరపై నిలబెట్టినందుకు మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని దర్శకుడికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హీరో అఖిల్ గురించి మాట్లాడుతూ.. "అఖిల్ నువ్వు ఎంత కష్టపడ్డావో పక్కనుండి నేను చూశాను. గత పదేళ్లుగా నీ ప్రయాణం నాకు తెలియకపోయినా, అనుకున్న ఫలితాలు రానప్పుడు ఎలా ఉంటుందో నేను ఊహించగలను. రక్తం, చెమట, కన్నీళ్లు చిందించి పనిచేశావు. సెట్‌లో ఒక్క క్షణం కూడా ఖాళీగా కూర్చోవడం నేను చూడలేదు. ప్రతిదీ సరిగ్గా జరగాలని తపించేవాడివి. నువ్వు ఇంతటి ప్రేమకు, విజయానికి అర్హుడివి. పదో తేదీన నీకు విజయం వస్తుందని చెప్పాను, అది వచ్చింది. అఖిల్, నువ్వు వచ్చేశావ్. నీతో కలిసి మళ్లీ నటించడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నువ్వొక అద్భుతమైన పెర్ఫార్మర్" అంటూ ప్రశంసించారు.



## ఓటీటీలో 'జాన్వీ' సీన్స్ సంగతేంటో..!



రామ్ చరణ్ హీరోగా వచ్చిన రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ ఏకంగా రూ.400 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డ్ క్రియేట్ చేసింది. శ్రీకాకుళం బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించింది. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈనెల 9 నుంచే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ కోసం ఆడియన్స్ సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో ప్రేక్షకులు పెద్ది ఓటీటీ వర్షన్‌పై క్లారిటీ కోరుకుంటున్నారు. ఈ మూవీలోని జాన్వీ కపూర్ అచ్చియమ్మ పాత్రపై విమర్శలు రావడంతో కొన్ని సీన్స్ తొలగించారు. ఆ తర్వాత మరిన్ని యాడ్ చేసి థియేటర్లలో రిలీజ్ చేశారు. ఇదే విషయంపై ఓటీటీ ప్రియులు క్లారిటీ కోరుతున్నారు. ఓటీటీలో జాన్వీ కపూర్ పాత సీన్స్‌తోనే పెద్దిని స్ట్రీమింగ్ చేస్తారా అనే సందేహం ఆడియన్స్‌లో నెలకొంది. లేదంటే కొత్త సీన్స్ యాడ్ చేసిన పెద్దిని స్ట్రీమింగ్‌కు తీసుకొస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ విషయంలో నెట్‌ఫ్లిక్స్‌తో పాటు మేకర్స్ కూడా ఎలాంటి అనౌన్స్ చేయలేదు. ఈ విషయంలో సినీ ప్రియులకు పెద్ది ఓటీటీ వర్షన్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. కాగా.. గతంలో రామ్ చరణ్ నటించిన గత సినిమా గేమ్ ఛేంజర్ కూడా ఇలాంటి పరిస్థితే చూసింది.



## బిడ్డను కనాలన్నాడు

బాలీవుడ్ నటి షమితా శెట్టి తన ఎండోమెట్రియోసిస్ అనుభవాన్ని ఓపెన్‌గా పంచుకుంటూ నెటిజన్లను ఆకట్టుకుంది. 2024 మేలో ఈ సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్న షమిత... సోహా అలీ ఖాన్ హోస్ట్ గా వ్యవహరించిన 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఒక డాక్టర్ తనకు "ఓ బిడ్డను కను.. అదే ఎండోమెట్రియోసిస్‌కు నివారిణి" అని సలహా ఇచ్చాడని షమిత చెప్పింది. దీనికి సమాధానంగా... "ఓకే. బేబీని పుట్టించేందుకు మనిషిని ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి?" అని సరదాగా అడిగానని వెల్లడించింది. 47 ఏళ్ల షమిత ఇప్పటికీ అవివాహితగానే ఉన్న సంగతి తెలిసిందే.



## 24న జన నాయగన్ రిలీజ్?

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ నటించిన చివరి చిత్రం 'జన నాయగన్' ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా, సెన్సార్ బోర్డుతో సుదీర్ఘ వివాదాలు, కోర్టు చుట్టూ తిరగడం వల్ల గత ఏడు నెలలుగా ల్యాబ్‌కే పరిమితమైపోయింది. అయితే ఈ అడ్డంకులన్నింటినీ అధిగమించి, ఎట్టకేలకు సెన్సార్ బోర్డు నుంచి 'ఎ' సర్టిఫికెట్ సాధించుకుంది. ఈ విషయాన్ని విజయ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. కోలీవుడ్ వర్గాల ప్రకారం... 'జన నాయగన్' ఈ నెల 24న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి హెచ్. వినోద్ దర్శకత్వం వహించగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. విజయ్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమిత బైజు, బాబీ డియోల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తెలుగులో బ్లాక్‌బస్టర్ అయిన 'భగవంత్ కేసరి' సినిమాకు ఈ చిత్రం రీమేక్ లేదా కొన్ని ముఖ్యమైన సీన్ల స్ఫూర్తితో తెరకెక్కినట్లు ఇండస్ట్రీలో గట్టి ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై దర్శకుడు వినోద్ స్పందిస్తూ... ఇది పక్కా విజయ్ మార్క్ కమర్షియల్ చిత్రమని, థియేటర్లలో అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో విడుదలవుతున్న తొలి, చివరి సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# 170కే ఇంగ్లండ్ ఆలౌట్

## ఐదు వికెట్లతో క్రాంతి గౌడ్ దూకుడు

లార్డ్స్‌లో జరగుతున్న చరిత్రాత్మక టెస్టులో భారత పేసర్ క్రాంతి గౌడ్(3-25) నిప్పులు చెరిగింది. తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శనతో ఇంగ్లండ్ నడ్డివరిచింది. స్వింగ్‌తో టాపార్డర్‌ను కూల్చిన క్రాంతి.. లంచ్ తర్వాత విజృంభించగా ఆతిథ్య జట్టు 170కే ఆలౌటైంది. అమీ జోన్స్(52), కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) మినహా ఎవరూ రాణించకపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 115 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సయాలీ సత్ఘరే(1-36), స్నేహ్ రాణా(1-35) రాణించారు. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.







# అయిపాయే..!

### చివరి టీ20లోనూ టీమిండియా ఓటమి.. 4-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న ఇంగ్లండ్

### శతకంతో చెలరేగిన కెప్టెన్ బట్లర్, మెరిసిన హ్యారీ బ్రూక్.. 14 నుంచి ఇరు జట్ల మధ్య వన్డే సిరీస్ ప్రారంభం

**ఇంగ్లండ్ పర్యటనలో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత యువ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్ 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన నామమాత్రపు ఐదో టీ20లో ఇంగ్లండ్ 56 పరుగుల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది.**

ఈ పర్యటన ఆరంభం నుంచి తడబడిన టీమిండియా, చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలుపుకుంటుందని భావించినా అది జరగలేదు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా, మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.




ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. అయితే, అతని నిర్ణయాన్ని ఇంగ్లండ్ బ్యాటర్లు తలకిందులు చేశారు. ముఖ్యంగా జోస్ బట్లర్ (64 బంతుల్లో 131; 12 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 95; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. భారత బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో పరుగుల సునామీ సృష్టించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 233 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 4 ఓవర్లలో 60 పరుగులు, అక్షర్ పటేల్ 4 ఓవర్లలో 63 పరుగులు సమర్పించుకుని అత్యంత ఖరీదైన బౌలర్లుగా నిలిచారు. శివమ్ దూబే ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. 258 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు సరైన ఆరంభం లభించలేదు. అభిషేక్ శర్మ (3) త్వరగా ఔటయ్యాడు. అయితే, ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్ (35 బంతుల్లో 56; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), తిలక్ వర్మ (25 బంతుల్లో 53; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకాలతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సంజూ శాంసన్ (27), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28) కూడా వేగంగా ఆడినా, కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్య ఛేదన కష్టంగా మారింది. ఇంగ్లండ్ బౌలర్లలో శామ్ కరన్ 3 వికెట్లతో భారత పతనాన్ని శాసించగా, ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టాడు. దీంతో భారత జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకే పరిమితమై ఓటమిని మూటగట్టుకుంది. అంతకుముందు, ఐర్లాండ్ చేతిలో సిరీస్ ఓటమిపాలైన టీమిండియాకు... ఇప్పుడు ఇంగ్లండ్ పై ఓటమితో ఈ పర్యటన ఓ పీడకలగా ముగిసింది. ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జూలై 14న ప్రారంభం కానుంది.




# వింబుల్డన్‌లో సచిన్ దంపతులతో గిల్



భారత టెస్టు, వన్డే జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సందడి చేశాడు. లండన్‌లోని సెంటర్ కోర్టులో ఉన్న రాయల్ బాక్స్‌కు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న గిల్.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆయన భార్య అంజలితో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. వీరు ముగ్గురూ కలిసి కూర్చున్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వింబుల్డన్ రాయల్ బాక్స్‌కు ఆహ్వానం అందుకున్న నాలుగో భారత క్రికెట్ కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. ఇంతకుముందు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఈ గౌరవం దక్కింది. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సచిన్‌ను వింబుల్డన్ నిర్వాహకులు 'క్రికెట్ రాయల్టీ'గా అభివర్ణించడం విశేషం. వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా కూడా రాయల్ బాక్స్‌లో ప్రత్యేక అతిథిగా కనిపించాడు. ఇటీవల శుభ్‌మన్ గిల్ మరో అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌లోనూ సందడి చేశాడు. బ్రిటిష్ గ్రాండ్ ప్రిక్స్ సందర్భంగా సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌లో జరిగిన ఫార్ములా-1 రేసును ప్రత్యేక అతిథిగా వీక్షించాడు. ప్యాడక్‌ను సందర్శించిన గిల్.. ఫార్ములా-1 ప్రముఖులతో ముచ్చటించి రేసింగ్ వాతావరణాన్ని ఆస్వాదించాడు. మరోవైపు సచిన్ కుమార్తె సారా టెండూల్కర్‌తో గిల్ రిలేషన్‌లో ఉన్నారనే ప్రచారం గత కొన్నేళ్లుగా సోషల్ మీడియాలో వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఇద్దరూ ఎప్పుడూ స్పందించలేదు. అయినప్పటికీ వింబుల్డన్‌లో సచిన్ పక్కనే గిల్ కనిపించడంతో నెటిజన్లు మరోసారి ఆ విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

# సెమీస్‌లోకి స్పెయిన్

## బెల్జియంపై 2-1 తేడాతో విన్



ఫిఫా వరల్డ్‌కప్ సెమీస్‌లోకి స్పెయిన్ ప్రవేశించింది. క్వార్టర్స్ మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో బెల్జియంపై గెలుపొందింది. సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ మైకేల్ మెరినో ఆఖరి నిమిషాల్లో గోల్ కొట్టి.. స్పెయిన్ శిబిరంలో సంబరాలు నింపాడు. ప్రీ క్వార్టర్స్‌లో పోర్చుగల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ మెరినో చివరి క్షణాల్లో గోల్ చేసి అద్భుత విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. బెల్జియం గోల్ కీపర్ గాయం వల్ల తప్పుకోవడంతో.. బ్యాకప్ కీపర్‌గా వచ్చిన లెమ్మెన్స్ బంతిని అందుకోవడంలో విఫలమ్యాడు. ఆ కీపర్‌ను తాకిన బంతి.. మళ్లీ ముందుకు వచ్చింది. ఆ సమయంలో మెరినో దాన్ని గోల్‌గా మలిచాడు. గోల్ పోస్టు రూఫ్ లోపల ఆ బంతి తగిలింది. ఆట 88వ నిమిషంలో ఆ గోల్ వచ్చింది. తొలుత స్పెయిన్ జట్టులో ఫాబియానా రూయిజ్ 30వ నిమిషంలో గోల్ చేశాడు. అయితే బెల్జియం ప్లేయర్ డీ కేటిలేరి 41వ నిమిషంలో గోల్ చేశాడు. సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన స్పెయిన్.. టోర్నమెంట్ ఫవరేట్ ఫ్రాన్స్‌తో ఈ శుక్రవారం తలపడనున్నది.



తక్కువోళ్లు 'ఇనాం' అంటారు..
పెద్దోళ్లు 'టిప్' అంటారు..
గుడిలో 'దక్షిణ' అంటారు..
గుడి బయట 'చందా' అంటారు..
సర్కారోళ్లు 'ముడుపులు' అంటారు..
పొలిటీషియన్లు 'సూట్‌కేసులు' అంటారు..
పేర్లు వేరైనా.. కక్కుర్తి రూపం ఒక్కటే..!
కనికరం లేదు..
కావాల్సింది రూపాయి ఒక్కటే..!

- కరెంటు మీటర్ పెట్టాలంటే లంచం
- కరెంటు వైర్ గుంజాలంటే లంచం
- నాలా కన్వర్షన్ చేయాలంటే లంచం
- ఇల్లు పర్మిషన్ కావాలంటే లంచం
- కలల ఇల్లు కట్టుకోవాలంటే లంచం
- రైతుకు పట్టా చేయాలంటే లంచం
- స్టేషన్ బెయిల్ ఇవ్వాలంటే లంచం
- స్టేషన్‌కు రప్పించుకోవద్దంటే లంచం
- అక్రమాన్ని సక్రమం అనాలంటే లంచం



"గతంలో ప్రభుత్వ అధికారులకు జర్నలిస్టులంటే కొంచెం భయం ఉండేది. కానీ, ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని ఓ జిల్లాలో ఆర్డీవో ఆఫీస్‌లో ఏవోగా పనిచేసిన ఓ లంచగొండి.. కొత్త పేపర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం జర్నలిస్టునే రూ.5 వేలు డిమాండ్ చేశాడంటే ఏ స్థాయిలో భయం, భక్తి లేకుండా పోయాయో ఇట్టే తెలిసిపోతుంది."

# ఖుషీ కొద్దీ.. బిచ్చగాళ్లు!

## కాస్ట్‌లీగా అడుక్కునే చిల్లరగాళ్లు

శ్రావణ వాణి

"అన్నీ డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా, ఫైల్ ముందుకు కదిలేందుకు ఆఫీస్‌లోనే లంచం అడిగాడో హైదరాబాద్ శివారుకు చెందిన ఎమ్మార్వో. 'మీరు ఇచ్చేటోళ్లు.. మేం తీసుకునేటోళ్లం' అని బరితెగించి అడిగాడు. అంతేనా.. ఆ కార్యాలయంలోని డిప్యూటీ ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ అసిస్టెంట్.. తదితరులు తలా రూ.10 వేలు డిమాండ్ చేయడం గమనార్హం. సర్కారు జీతం ఇస్తది, అలవెన్సులు ఇస్తది, అయినా బిచ్చగాళ్లలా అడుక్కుంటున్నారు. బిచ్చగాళ్లయినా 'ధర్మం చేయండి' అని దీనంగా అడుగుతారు. కానీ, కాస్ట్‌లీగా అడుక్కునే సర్కారీ చిల్లరగాళ్లున్నారు మన మధ్య."



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్
ఎంటెక్, ఎల్ఎల్‌బీ, ఫోన్ నంబర్: 9581291919

పైసా లేనిదే పని కాదు.. మనం తరచూ వినే మాట. క్యాజువల్‌గా అనిపించినా, మానసికంగా ఎంతలా కుంగదీస్తుందో ప్రతీ ఒక్కరికి అనుభవమే. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే సాధారణ పౌరుడు తన దరఖాస్తు, ఫిర్యాదు లేదా హక్కుకు సంబంధించిన పనిని చేయించుకోవడానికి ముందుగా వెతికేది సంబంధిత అధికారిని కాదు.. ఎంత ఇవ్వాలో చెప్పే మధ్యవర్తిని. ఈ పరిస్థితి ఒక రోజులో ఏర్పడలేదు. దశాబ్దాలుగా వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి క్రమంగా ప్రజల మనస్తత్వాన్నే మార్చేసింది. ఇప్పుడు లంచం ఇవ్వకుండా పని చేయించుకోవడం సాధ్యమేనా? అనే ప్రశ్నే చాలా మందికి ఆశ్చర్యంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒకప్పుడు సేవ. ప్రజలకు న్యాయం చేయడం, సమస్యలు పరిష్కరించడం, చట్టాన్ని అమలు చేయడం ఉద్యోగ ధర్మంగా భావించేవారు. కానీ కాలక్రమేణా కొందరు అధికారులు ఆ బాధ్యతను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రత్యేకించి రెవెన్యూ శాఖ పేరు వినగానే సాధారణ ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఫైళ్లు, ధ్రువపత్రాలు, పట్టాదారు పాస్‌బుక్కులు, భూ వివాదాలు.. వాటితో పాటు లంచాల ఆరోపణలు. భూమి అనేది సాధారణ కుటుంబానికి జీవితకాల ఆస్తి. అలాంటి భూమికి సంబంధించిన పని కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన రైతు, పేద కుటుంబం లేదా వృద్ధుడు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కొన్నిసార్లు పని చేయాల్సిన అధికారి నేరుగా డబ్బు అడగకపోయినా, మధ్యవర్తుల ద్వారా సంకేతాలు పంపించడం, ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టడం, చిన్న చిన్న అభ్యంతరాలు చెప్పడం వంటి పద్ధతులు అవినీతికి కొత్త రూపాలు అయ్యాయి. 'ఫైల్ కదలాలంటే ఖర్చు ఉంటుంది' అనే మాట అధికారిక భాషలో భాగమైపోయింది. చట్టం ప్రకారం ఉచితంగా జరగాల్సిన సేవ కూడా డబ్బు చెల్లించిన తర్వాతే వేగంగా పూర్తవుతోందనే భావన ప్రజల్లో బలపడింది. ప్రభుత్వం ప్రజల పన్నుల డబ్బుతో నడుస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా ప్రజలే చెల్లిస్తున్న పన్నుల నుంచే వస్తాయి. కానీ, ప్రభుత్వ సేవకు సెప'రేటు' తప్పనిసరి. ఇది కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితం కాలేదు. సమాజంలో అనేక రంగాల్లో "టిప్" పేరుతో, "సౌకర్య రుసుము" పేరుతో, "ఫీజు" పేరుతో చట్టబద్ధం కాని చెల్లింపులు పెరుగుతున్నాయి. నిజమైన సేవకు కృతజ్ఞతగా స్వచ్ఛందంగా ఇచ్చే టిప్‌కు, పని చేయడానికి ముందే డబ్బు డిమాండ్ చేసే లంచానికి స్పష్టమైన తేడా ఉంది. కానీ ఈ రెండింటి మధ్య గీతను సమాజం క్రమంగా చెరిపేస్తోంది. అదే అత్యంత ప్రమాదకర పరిణామం. ప్రజలు కూడా "ఇవ్వకపోతే పని జరగదు" అనే నిరాశావాదానికి అలవాటు పడిపోయారు. ఫిర్యాదు చేయడం కంటే డబ్బు ఇచ్చి పని చేయించుకోవడానికే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల అవినీతిపరులకు మరింత ధైర్యం వస్తోంది. చట్టాన్ని ఉల్లంఘించినా పెద్దగా ఏమీ కాదనే భావన బలపడుతోంది.

### ఎగ్జాంపుల్.. శామీర్‌పేట్ ఎమ్మార్వో కేసు!

తెలంగాణలో ఇటీవల వెలుగులోకి వచ్చిన శామీర్‌పేట్ తహసీల్దార్ (ఎంఆర్వో) కేసు సాధారణ లంచం కేసు కాదు. ప్రభుత్వ ఉద్యోగి అక్రమ సంపాదన ఎంత పెద్ద స్థాయికి చేరుకుంటుందో దేశానికి చూపించిన సంఘటనగా నిలిచిపోయింది. మొదట ఒక భూ సంబంధిత పనిలో భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో ఏసీబీ ఉచ్చులో చిక్కిన ఈ కేసు, ఆ తరువాత ఆదాయానికి మించిన ఆస్తుల దర్యాప్తుగా మారింది. ఏసీబీ అధికారులు చేసిన సోదాల్లో బయటపడిన నగదు, బంగారం, వజ్రాభరణాలు, ఖరీదైన స్థలాలు, ఫ్లాట్లు, వ్యవసాయ భూములు, పెట్టుబడులు చూసి ప్రజలు నివ్వెరపోయారు. అధికారిక లెక్కల ప్రకారం కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నెలకు లక్షల్లో జీతం తీసుకునే ఒక ప్రభుత్వ అధికారి వద్ద ఇంత భారీ ఆస్తులు ఎలా వస్తాయ్? దోచుకుంటే తప్ప. ఒక అధికారి ఇంత స్థాయిలో ఆస్తులు కూడబెట్టే వరకు సంబంధిత శాఖలు, విజిలెన్స్ వ్యవస్థలు, ఆదాయపు పన్ను విభాగం, ఇతర పర్యవేక్షణ యంత్రాంగాలు ఎందుకు గుర్తించలేకపోయాయి? అన్న ప్రశ్న కూడా కీలకమే. వారానికో అవినీతి అధికారి పట్టుబడుతున్నా, అధికారులు తమకేం కాదులే అన్నట్లు వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి చెంప పెట్టు. అవసరం పేరుతో, ఆచారం పేరుతో, సేవ పేరుతో, చందా పేరుతో, కృతజ్ఞత పేరుతో.. ప్రతి చోట డబ్బే కేంద్రబిందువుగా మారింది. డబ్బు లేకుండా ఏ పని జరగదనే భావన కలుగుతోంది. కాదు.. కలిగేలా చేస్తున్నరు. ప్రభుత్వ కార్యాలయంలో ఒక ధ్రువీకరణ పత్రం కావాలన్నా, ఫైలు కదలాలన్నా 'ఛాయ్ ఖర్చు' పేరుతో లంచం అడిగే పరిస్థితి ఎంత దారుణం. ప్రజా పాలన, ప్రజల వద్దకు పాలన, పారదర్శక పాలన.. అంటూ పనికిరాని ఫోజులిస్తరు. సేవ చేస్తున్నాం అంటూ సామాన్యుడి చెమటను దోచేస్తున్నరు. పేదోడి రక్తపు కూడు తింటున్నమన్న ఇంగిత జ్ఞానం లేని లంచగొండి బ్యాచ్‌కు, సేవ అనడానికి అర్హత ఉందా..? ఇక, హోటల్‌కు వెళ్తే బిల్లు చెల్లించిన తర్వాత కూడా టిప్ ఇవ్వాలనే అప్రకటిత ఒత్తిడి ఉంటుంది. టిప్ అనేది సేవ నచ్చితే స్వచ్ఛందంగా ఇచ్చే అభినందన కావాలి. కానీ అది హక్కుగా భావించడం సరైంది కాదు. అదే విధంగా రాజకీయాల్లో ఎన్నికల సమయంలో సూట్‌కేసులు, విరాళాలు, ఫండ్ల పేరుతో జరిగే వ్యవహారాలు మరో ఎత్తు. అధికారాన్ని సేవగా కాకుండా పెట్టుబడిగా చూసే ధోరణితో ప్రజలపైనే భారం పడుతోంది. ఈ పరిస్థితుల్లో సామాన్యుడి జీతం సరిపోవడం లేదు. ఒకవైపు పన్నులు, మరోవైపు ధరల పెరుగుదల, వాటికి తోడు ప్రతి అడుగులో ఇలాంటి అదనపు చెల్లింపులు. నెలంతా కష్టపడి సంపాదించిన జీతం బ్యాంకు ఖాతాలో పడుతుంది. కానీ ఆ డబ్బు ఇంటి అవసరాలకు కాకుండా, లంచాలు, చందాలు, దక్షిణలు, టిప్పులు, అనధికార వసూళ్లకే కరిగిపోతున్నది.

### దేవుడూ దోపిడీ..!

పొద్దున్నే లేచి, చక్కగా స్నానం చేసి, మంచి బట్టలు వేసుకొని, ప్రశాంతత కోసం గుడికి పోదాం అనుకుంటాం. గుడి దాకా ప్రశాంతత కోసమే వెళ్తాం. కానీ, అక్కడే మొదలవుతుంది.. అసలైన ప్రశాంతత. గుడి బయట చెప్పులు పెట్టాలంటే పైసల్.. సెల్‌ఫోన్ దాచాలంటే పైసల్.. రూ.30 కొబ్బరికాయ రూ.50 పేరుతో దోపిడీ, సరే.. ఇచ్చేది దేవుడికే, పోతేపోనీలే అనుకొని గుడిలోకి ఎంటర్ అయ్యేముందు అసలు సిసలైన దేవుడి దోపిడీ మొదలవుతుంది. ఫ్రీ దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, వీఐపీ దర్శనం, వీవీఐపీ దర్శనం, ప్రొటోకాల్ దర్శనం.. అంటూ సెపరేటు రేట్లు ఉంటాయి. సరే, తొందరగా దేవుడి దర్శనం అయితే అదే పదివేలు అనుకొని టికెట్ కొని లోపలికి ఎంటరైతే, గోత్రనామాలకు రూ.50, అర్చనకు రూ.50, పూజకు రూ.50, హారతికి రూ.50, ప్రత్యేక పూజకు రూ.300.. అంటూ జేబు గుల్ల అవుతుంది. ఆ టికెట్ తీసుకొని పంతులు దగ్గరికి పోతే, హారతి పళ్లెంలో కనీసం రూ.100 పెడితే తప్ప.. అనుకున్న ఆశీర్వదనం అందదు. పది రూపాయలు తక్కువిచ్చినా 'మమ అనిపించి, పక్కకు జరుగు' అంటారు. బొట్టు పెట్టాలంటే పైసలియ్యాలె, అక్షింతలు వేయాలంటే పైసలియ్యాలె, తీర్థం కావాలంటే పైసలియ్యాలె. అలా ముందుకు పోతే, కొబ్బరికాయ కొట్టే దగ్గర మస్తు డిమాండ్. కొబ్బరికాయ కొట్టాలంటే రూ.10 చేతిలో పెట్టాల్సిందే. ఇవ్వకపోతే ఓ కొబ్బరిముక్క ముఖానికి విసిరికొడతారు. ఇదంతా చూస్తూ బయటికి వస్తే ఇంకెక్కడి ప్రశాంతత. ఇంకెక్కడి దేవుడు. గొప్ప గొప్ప కోరికలు అవసరం లేదు, దేవుడి దోపిడీ లేకపోతే అదే మహా ప్రసాదం అనుకొని ఇంటికి చేరాలి.



### ఇనాం బ్యాచ్ హంగామా

రోగమొచ్చి దవాఖానలో చేరితే.. బిల్లులతోనే ఆస్తులు కరిగిపోతాయ్. కొత్తగా అప్పులు పుట్టుకొస్తాయ్. పానం కంటే పైసలెక్కువా..! అని సర్దిచెప్పుకుంటం. రోగం తగ్గితేనో, సర్జరీ అయిపోయాకో.. డిశ్చార్జి అయ్యి ఇంటికి పోదామనుకుంటే 'ఇనాం' బ్యాచ్ మన ముందు వాలిపోతుంది. అప్పటిదాకా బెడ్ వైపు కన్నెత్తి చూడని కన్నింగ్ బ్యాచ్.. మేం మస్తు పనిచేసినం, ఊడ్చినం, తూడ్చినం, ముడ్లు కడిగినం, మూత్రం ఎత్తిపోశినం.. అని ఇనాం ఇయ్యుమంటరు. అసలే రోగంతో, ఆస్పత్రి బిల్లులతో తడిసి మోపెడైతే, ఈ బ్యాచ్ చేసే హంగామా మామూలుగా ఉండదు. పైసలిస్తే గేట్ దాకా తోలుకొస్తరు, ఇయ్యం అంటే ఇసుమంత కూడా దేకరు. చెప్పే పేరు సేవ.. వాళ్లదంతా తప్పుదోవ..!

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.